RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 314 మేడ్చల్ మల్కాజ్‌గిరి 5 డిసెంబర్ 2024 గురువారం పేజీలు : 4

## 'ఫెంగల్' నష్టంపై ప్రధాని మోదీ ఆరా

చెన్నై: ఇటీవల సంభవించిన ఫెంగల్ తుఫాన్ కారణంగా రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో అపారనష్టం వాటిల్లింది. దీంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. తుఫాను బాధిత జిల్లాల్లో జరిగిన నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు సీఎంకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఇదిలావుంటే, ప్రధాని మోదీ ఫోన్ చేసిన విషయంపై ముఖ్యమంత్రి స్టాలిన్ తన ఎక్స్ పేజీలో ట్వీట్ చేశారు. ఫెంగల్ తుఫాన్ సృష్టించిన నష్టంపై ప్రధాని మోదీ ఫోన్ చేసారని చెప్పారు. ఈ సందర్భంగా తుఫాను ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించినట్టు తెలిపారు. అంతేకాకుండా, ప్రకృతి వైపరీత్యం వలన కలిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని తక్షణం రాష్ట్రానికి పంపించాలని, వరద బాధితులను ఆదుకునేందుకు తక్షణ సాయం అందజేయాలని ప్రధానిని కోరినట్టు తెలిపారు.



## హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్.. ప్రభుత్వంతో కీలక ఒప్పందం

హైదరాబాద్: డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందు వరుసలో ఉందని, ఐటీ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సైబర్ సమస్యలపై హైదరాబాద్ కేంద్రంగా పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో గూగుల్ ప్రతినిధులు భేటీ అయ్యారు. జీఎస్ఈసీ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో గూగుల్ కంపెనీ కీలక ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ఆ సంస్థ సీఐవో రాయల్ హన్సెన్, అరిజిత్ సర్కార్, శ్రీనివాస్ రెడ్డికి.. సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ ఐటీ కంపెనీలు ఇప్పటికే హైదరాబాద్‌లో ఉన్నాయని.. గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్, అమెజాన్, మెటా సంస్థలు ప్రధాన కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేశాయన్నారు. సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ ఏర్పాటు వల్ల వేల సంఖ్యలో ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. గ్లోబల్ హబ్‌గా మారేందుకు హైదరాబాద్‌కు అన్ని అవకాశాలున్నాయని రాయల్ హన్సెన్ తెలిపారు. సైబర్, డిజిటల్ సెక్యూరిటీ, సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేయడానికి హైదరాబాద్ అనుకూల ప్రాంతమని ఆయన తెలిపారు.




హైదరాబాద్: దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమం బుధవారం హైటెక్స్‌లో రోశయ్య మెమోరియల్ ఫోరం, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను చంద్రబాబు నాయుడుతోకలిసి ఒక రిప్రజెంటేషన్ ఇవ్వడానికి రోశయ్య ఇంటికి వెళ్లానని, తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు రోశయ్య, చంద్రబాబుకు ఒక మాట చెప్పారన్నారు. "చూడయ్య చంద్రబాబు నాకు చీరాలలో ఏమీ లేదు.. 50 ఏళ్ళ క్రితం అక్కడున్నది అమ్ముకుని హైదరాబాద్‌కు వచ్చి.. అమీర్‌పేట ప్రాంతంలో ఇల్లు కట్టుకున్నా.. నేను హైదరాబాద్ వాడినే తప్పు.. నాకు ఆ రాష్ట్రమా.. ఈ ప్రాంతమా అనేది లేదని.. రెండు ప్రాంతాలు నాకు సమానమే" అని చెప్పారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈరోజు నికార్సైన హైదరాబాది ఎవరైనా ఉన్నారంటే అది రోశయ్యేనని తాను విశ్వసిస్తున్నానని అన్నారు.

అలాంటి వ్యక్తికి హైదరాబాద్‌లో విగ్రహం లేకపోవడం రాష్ట్రానికి లోటని.. రాష్ట్రంలో మంచి ప్రాంతం చూసి.. ప్రభుత్వానికి సూచన చేయాలని నేతలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డికి ఏ ప్రాంతంలో రోశయ్య విగ్రహం పెడితే బాగుంటుందో సూచన చేస్తే తప్పకుండా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే నాల్గవ వర్ధంతి లోపు రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆయన ఆర్యవైశ్య మిత్రులకే కాదు.. అందరికీ స్ఫూర్తి అని సీఎం కొనియాడారు. వార్డు మెంబర్ నుంచి... పార్లమెంట్ మెంబర్ వరకు.. రాష్ట్ర మంత్రి నుంచి ముఖ్యమంత్రి వరకు రోశయ్య ఒక స్ఫూర్తి అని.. అలాంటి వ్యక్తుల విగ్రహాలు ఉండడం ద్వారా సమాజానికి మంచి సందేశం ఇచ్చినవాళ్లమవుతాయని అన్నారు. రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తామని.. తెలంగాణ ముఖ్యమంత్రిగా ఆర్యవైశ్య మిత్రులకు మాట ఇస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## రాష్ట్రాన్ని వణికిస్తున్న చలిపులి

### ఆసిఫాబాద్ జిల్లాలో అత్యల్పంగా 9.4 డిగ్రీలు

### రానున్న మూడు రోజులు మరింత తీవ్రం: వాతావరణశాఖ

### మూడు జిల్లాలకు ఆరెంజ్.. 30 జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు



హైదరాబాద్ : పల్లె, పట్నం తేడా లేకుండా రాష్ట్రాన్ని చలి వణికిస్తోంది. పలుచోట్ల రాత్రిళ్లు చలి మంటలు.. ఉదయం పూట పొగ మంచు దృశ్యాలే కనిపిస్తున్నాయి. రెండు, మూడు రోజులుగా రాష్ట్రంపై మంచుదుప్పటి పరుచుకున్నట్లు వాతావరణం మారింది. రాత్రిపూటే కాదు మిట్ట మధ్యాహ్నమూ ఈదురు గాలులు వీస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 15 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రధానంగా ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో చలి ప్రభావం ఎక్కువగా ఉంది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

మంగళవారం రాత్రి సిర్పూర్ (యు)లో 9.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ జిల్లాలో కెరమెరి, వాంకిడి, ధనోరా, తిర్యాణి, ఆసిఫాబాద్ మండలాల్లో చలితీవ్రత ఎక్కువగా ఉంది. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్, భీంపూర్, బోథ్, బేల, ఆదిలాబాద్ గ్రామీణం, నేరడిగొండ, మావల మండలాలు వణికిపోతున్నాయి. మధ్య తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా కూడా గజగజమంటోంది. కోహీర్‌లో అత్యల్పంగా 9.9 డిగ్రీలు నమోదైంది. గుమ్మడిదల, కంగ్టి, న్యాల్‌కల్, అందోలు, పుల్కల్, జహీరాబాద్, మునిపల్లి మండలాల్లో తీవ్రత ఎక్కువగా ఉంది. పాడి రైతులు చలి నుంచి ఉపశమనం కోసం తమ పశువులను రాత్రంతా నెగళ్ల వద్ద కట్టేస్తున్నారు. రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కన్నా తగ్గుముఖం పట్టాయి. మహబూబ్‌నగర్, రామగుండంలలో సాధారణం కన్నా 2.7 డిగ్రీలు, హనుమకొండలో 2.6 డిగ్రీలు, హైదరాబాద్‌లో 1.2 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గింది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల నుంచి తెలంగాణవైపు గాలులు వీస్తుండటమే రెండు రోజులుగా రాష్ట్రంలో శీతల వాతావరణం ఏర్పడటానికి కారణమని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. రాష్ట్రంలో రానున్న మూడు రోజులు చలి తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. కుమురం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో కొన్ని మండలాల్లో 10 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రత ఉండే అవకాశాలు ఉన్నాయని సూచిస్తూ ఈ జిల్లాలకు ఆరెంజ్ రంగు హెచ్చరికలు జారీ చేసింది. 30 జిల్లాల్లో 15 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. వీటికి పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

**జాగ్రత్త అంటున్న వైద్యులు :** రాష్ట్రంలో ఆరెంజ్, పసుపు హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, వ్యాధులతో బాధపడుతున్నవారు అప్రమత్తంగా ఉండాలంటున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో ప్రయాణాలు మానుకుని మధ్యాహ్నం సమయంలోనే రాకపోకలు సాగించాలని పేర్కొంటున్నారు. ఏజెన్సీ ప్రాంతాల వారు వెచ్చని వాతావరణంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. చలితోపాటు ఈదురు గాలులు వీచే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ నిపుణులు సూచిస్తున్నారు. ఆరెంజ్ హెచ్చరికలు ఉన్న జిల్లాల్లో పర్యవేక్షణ ఉండాలని పేర్కొంటున్నారు.

ఏటా డిసెంబరు చివరిలో ఉష్ణోగ్రతలు అత్యంత తక్కువ స్థాయికి పడిపోతాయి. ఈ ఏడాది కొన్ని జిల్లాల్లో డిసెంబరు మొదట్లోనే ఆ పరిస్థితి నెలకొంది. గత పదేళ్లతో పోల్చితే రాత్రి నాలుగు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిజామాబాద్‌లో 12 డిగ్రీలు, హనుమకొండలో 12.9, మహబూబ్‌నగర్‌లో 13.4, నల్గొండలో 13.6 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.



## నాపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయండి


### హైకోర్టులో హరీశ్‌రావు పిటిషన్

హైదరాబాద్: పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరుతూ మాజీ మంత్రి, సిద్దిపేట భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన ఫోన్లను ట్యాప్ చేయించారని సిద్దిపేటకు చెందిన స్థిరాస్తి వ్యాపారి, కాంగ్రెస్ నేత గదగోని చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరీశ్‌రావు, విశ్రాంత పోలీసు అధికారి రాధాకిషన్‌రావుపై పంజాగుట్ట ఠాణాలో 120(బీ), 386, 409, 506 ఆర్/డబ్ల్యూ 34ఐపీసీ, 66 ఐటీ యాక్ట్ ప్రకారం ఆదివారం కేసు నమోదైంది. ఎన్నికల సమయంలో హరీశ్‌రావు తన ఫోన్‌తోపాటు కుటుంబ సభ్యులకు చెందిన 20 ఫోన్లను ప్రణీత్‌రావు సహాయంతో ట్యాప్ చేశారని చక్రధర్‌గౌడ్ ఆరోపించారు.

తాను అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. న్యాయస్థానంలో రిట్ పిటిషన్ వేయగా... కోర్టు ఆదేశాలతోనే పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.

# ప్రతిష్టంభనకు తెరపడింది!

## మహారాష్ట్ర సీఎంగా దేవేంద్ర ఫడణవీస్ ఖరారు




ముంబయి: మహారాష్ట్రలో ప్రభుత్వం ఏర్పాటుపై గత కొంతకాలంగా నెలకొన్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా భాజపా సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ పేరు ఖరారైంది. ఈమేరకు బుధవారం జరిగిన భాజపా కోర్ కమిటీ సమావేశంలో ఫడణవీస్ పేరును ప్రతిపాదించగా.. ఏకగ్రీవంగా ఆమోదించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

డిసెంబరు 5న ఆయన మహారాష్ట్ర సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపాయి. కోర్ కమిటీ భేటీ తర్వాత ముంబయిలోని విధాన్ భవన్‌లో భాజపా శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర పరిశీలకులుగా ఉన్న నిర్మలా సీతారామన్, విజయ్ రూపానీ హాజరయ్యారు. సీఎం ఎంపికపై పార్టీ ఎమ్మెల్యేలతో వారు చర్చించారు. అనంతరం భాజపా శాసనసభాపక్ష నేతగా దేవేంద్ర ఫడణవీస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఆజాద్ మైదానంలో ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది. ప్రధాని మోదీ సహా ఎన్డీయే కీలక నేతలు హాజరుకానున్నారు. సీఎంగా ఫడణవీస్‌తో పాటు శివసేన నేత ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. 288 శాసనసభ స్థానాలు ఉన్న మహారాష్ట్రలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఏకంగా 230 స్థానాలతో భారీ మెజార్టీ దక్కించుకుంది. అయితే, ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పాటుపై కూటమిలో ప్రతిష్టంభన నెలకొంది. సీఎం ఎంపిక, శాఖల కేటాయింపులపై భాజపా, శివసేన, ఎన్సీపీల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. డిప్యూటీ సీఎం పదవికి అంగీకరించని ఏక్‌నాథ్ శిందే, హోంశాఖ కేటాయించాలని పట్టుబట్టినట్లు వార్తలు వచ్చాయి. దీంతో కేంద్రంలోని భాజపా అధిష్ఠానం రంగంలోకి దిగి బుజ్జగింపులు మొదలుపెట్టింది. చివరకు ఆ చర్చలు ఫలించినట్లు తెలుస్తోంది. మరోవైపు, సీఎంగా భాజపా నేతే ఉంటారని ముందునుంచీ ప్రచారం జరిగినా ఫడణవీస్ స్థానంలో ఇంకెవరినైనా తీసుకుంటారా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, పార్టీ అధిష్ఠానం మాత్రం ఆయన వైపే మొగ్గు చూపింది. దీంతో ముఖ్యమంత్రిగా మూడోసారి ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. అంతకుముందు ఫడణవీస్ 2014 నుంచి 2019 వరకు సీఎంగా వ్యవహరించారు. 2019లో రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటికీ అప్పటి రాజకీయ పరిస్థితుల వల్ల 5 రోజులకే రాజీనామా చేయాల్సి వచ్చింది.

# సంపాదకీయం

## కూటమి ఆరు నెలల ప్రొగ్రెస్ రిపోర్టు...

# మంత్రులకు టెన్షన్!

ఏపీలో తెలుగుదేశం పార్టీ నాయకత్వం లో కూటమి ప్రభు త్వం అధికారం చేపట్టి ఈ నెల 12తో ఆరు నెలలు నిండుతున్నాయి. అంటే హానీమూన్ కంప్లీటెడ్ అన్న మాట. ఏ ప్రభుత్వం మీద అయినా జనాలకు ఆశలు అన్నీ తొలి ఆరు నెలలలో మబ్బులలా కమ్ముకుంటా యి. దాంతో ప్రభుత్వం గురించి ప్రజలు సాను కూల ధోరణిలోనే చూస్తూంటారు. ఆ మబ్బులు మెల్లగా విడిపోయే కాలం ఆ తరువాత మొదలవుతుంది. అపుడు పాలన ఎలా సాగుతుంది అన్నది ప్రజలు కూడా రివ్యూస్ చేస్తారు. ప్రజల రివ్యూస్ ఎలా ఉన్నా ప్రభుత్వం కూడా తన వంతు రివ్యూస్ ఎప్పటికపుడు చేసుకుంటూ ఉండాలి. ఆ విషయంలో రాజకీ యంగా ధక్కామెక్కీలు తిన్న చంద్రబాబుకు ఎవరూ చెప్పాల్సిన అవసరం అయితే లేనే లేదు అని అంటున్నారు. ఆయన ప్రజల నాడిని ఎప్పటికపుడు పట్టుకోవడానికే చూస్తూంటారు అని అంటున్నారు. ఇదిలా ఉంటే బాబు కేబినె ట్ లో 24 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో అరడజను మంది తప్ప అంతా కొత్త ముఖాలే ఉన్నారు. అదే సమయంలో బాబు మంత్రుల పనితీరు మీద ఎప్పటికపుడు అధ్యయనం చేస్తున్నారు. తనదైన నివేదికలను ఆయన దగ్గర పెట్టుకుని వారికి తగిన సూచనలు చేస్తూ వస్తున్నారు. ఇక తాజాగా నిర్వహించిన కేబినెట్ సమావేశంలోనూ మంత్రులకు బాబు దిశా నిర్దేశం చేసినట్లుగా చెబుతున్నారు. ఆరు నెలల పాలన ముగుస్తున్న నేపథ్యంలో ప్రతీ మంత్రి తన శాఖ పరిధిలో పనితీరు మీద నివేదికలను చంద్రబాబు కోరారు. అంటే మంత్రులు తమ శాఖల పనితీరుని ఈ విధంగా బాబు మధింపు చేస్తారు అని అంటున్నారు. అంతే కాదు బాబు వద్ద కూడా మంత్రుల పనితీరు మీద నివేదికలు ఉన్నాయని అంటున్నారు. దాంతో వీటిని అన్నింటికీ క్రోడీకరించి మంత్రులకు రానున్న రోజులల లో పనితీరుని మెరుగుపరచుకో వడానికి సూచనలు ఇస్తారని అంటు న్నారు. ఒక విధంగా మంత్రుల పనితీరుకు ప్రొగ్రెస్ రిపోర్టులు గా వీటిని చూస్తున్నారు. మొత్తం మంత్రులలో కొందరు మాత్రమే తమ శాఖల లో పట్టు సాధిస్తున్నారు అని అంటున్నారు. మరి కొందరు నెమ్మదిగా గాడిలో పడుతున్నా రని కూడా చెబుతున్నారు. కొందరు మంత్రులు మాత్రం ఇంకా పట్టు సాధించే పనిలోనే ఉ న్నారని అంటున్నారు. దీంతో ఆరు నెలల పాల న పూర్తి అవుతున్న నేపథ్యంలో చంద్ర బాబు మంత్రుల విషయంలో కాస్తా సీరియస్ గానే వ్యవహరిస్తారు అని ప్రచారం అయితే సాగు తోంది. ప్రభుత్వం పనితీరు అన్నది మంత్రులు ఎమ్మెల్యేల పనితీరు మీదనే ఎక్కువగా ఆధారప డుతుంది. అందుకే బాబు పదే పదే మంత్రుల ను తమ పనితీరుని వీలైనంత మె రుగ్గా చేసుకో వాలని కోరుతున్నారు. అంతే కాదు వారు బాగా రాణిం చాలని ఆశిస్తున్నారు. ఏ మాత్రం ప్రభా వం చూపించకపోయినా ఇబ్బం దులు వస్తాయ న్నది కూడా కూటమి పెద్దల ఆలోచనగా ఉ ంది. దీంతో మంత్రులు తమ శాఖలలో పనితీరు మీద ఈ విధమైన నివేదికలు ఇస్తారు అన్నది ఇపుడు చర్చనీయాశం అయింది. అదే సమయంలో చంద్రబాబు వద్ద కూడా ఉ ంటాయని భావిస్తున్న ప్రొగ్రెస్ నివేదికలు ఏమి చెప్పబోతున్నాయన్నది కూడా చూడాలని అంటున్నారు. మొత్తం మీద చూస్తే గతంలో ఎలా ఉన్నా ఇక హానీమూన్ పీరియడ్ ము గుసినం దువల్ల అంతా పూర్తిగా తమ శాఖల విషయంలో పట్టు సాధించి ముందుకు సాగా లని చంద్రబాబు కోరుతున్నారని అంటున్నారు.

## ఆరోగ్య తెలంగాణానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం : వజ్రేష్ యాదవ్

### తుర్కపల్లిలో ఆరు పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం



శామీర్ పేట, (గరుడ వార్త) : ఆరోగ్య తెలంగాణగా రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలని టీపీసీసీ ఉ పాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం శామీర్ పేట మండలం తుర్కపల్లి గ్రామంలో 6 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షత వహించగా మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, ఉద్దమర్రి నరసింహారెడ్డి, డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ఈ ఆస్పత్రి ఏర్పాటుకు మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి ఎంతగానో కృషి చేశాడని తెలిపారు. వేణుగోపాల్ రెడ్డి చొరవతో ఈ ఆసుపత్రిని ఈరోజు ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, డి ఎం హెచ్ ఓ, శామీర్ పేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యుడు శ్రీకాంత్, తూంకుంట మున్సిపాలిటీ అధ్యక్షుడు భీమిడి జయపాల్ రెడ్డి, మూడు చింతలపల్లి మండల్ మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి శామీర్ పేట మండల మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వందల్లో కార్మికులు.. విధుల్లో కనిపించరు




కరీంనగర్ : నగరంలోని టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డు, సప్తగిరి కాలనీ ప్రాంతాల్లో రహదారులు శుభ్రంగా ఉండటంలేదు. ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. ఫిర్యాదు చేస్తే తప్ప కార్మికులు కనిపించడం లేదు.గణేశ్‌నగర్ బైపాసు రోడ్డుకు ఇరువైపులా కొద్ది రోజులుగా ఊడవటం లేదు. ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. గతంలో మాదిరిగా శుభ్రతను పట్టించుకోవడం లేదు.

కూడళ్ల చుట్టూ చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉంచేవారు. ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలు తొలగించేవారు. ప్రస్తుతం హరితహారం కార్మికులు తొలగించకపోగా, డివిజన్ కార్మికులు సైతం ఆవైపు చూడటం లేదు. పై ఉదాహరణలు చాలు కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ గాడి తప్పుతుంది అనడాని కి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డులు, ర్యాంకులు సాధించిన నగరంలో.. కొద్ది నెలలుగా అపరిశుభ్రత ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తోంది. పండగల సమయంలో అయితే రహదారులు అధ్వానంగా మారుతు న్నాయి.

**ప్రైవేటు పనులకే పరిమితం..**

నగరంలో పారిశుద్ధ్య కార్మికులు డివిజన్‌కు కనీసం 10 నుంచి 12 మంది పని చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన పరిశీలిస్తే ఒక్కోచోట 8 మంది కూడా క్షేత్రస్థాయిలో ఉండటం లేదు. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్లలో పనిచేస్తుండగా, మరికొందరు డివిజన్‌లలో ప్రైవేటు పనులలో నిమగ్నమవుతున్నారు.

గాంధీరోడ్డులో రాత్రిపూట పనిచేసే కార్మికులే లేరు. డ్రైవర్లు, లోడర్లు లేకపోవడంతో రోజంతా పనిచేసేవారితోనే చెత్తను ఎత్తిస్తున్నారు.

భూగర్భ డ్రైనేజీలు ఉన్నచోట పూడికతీసే కార్మికులు కనిపించడంలేదు.

**అటకెక్కిన పర్యవేక్షణ**

నగరంలో పారిశుద్ధ్య విభాగానికి పర్యవేక్షకులు లేకపోవడంతో ఇన్‌ఛార్జిలతో నెట్టుకొస్తున్నారు. దీంతో పనులలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. రోజూ ఉదయం, మధ్యాహ్నం తనిఖీలు లేకపోవడంతో పనులు సక్రమంగా జరగడం లేదనే ఫిర్యాదులు అధికమయ్యాయి.

**నగరపాలిక పనులు వదిలేసి..**

డివిజన్‌లలో రహదారులకు ఇరువైపులా శుభ్రంగా ఊడవటం, ప్రతీ వీధిలోని బహిరంగ మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించడం, ప్రభుత్వ కార్యాలయాల దగ్గర పిచ్చిమొక్కలు లేకుండా చూడటంవంటి పనులు చేయాల్సి ఉండగా పట్టించుకోవడంలేదు. నగరపాలిక పనులు చేయకుండా కార్మికులను ప్రైవేటు ప్లాట్ల వద్ద శుభ్రం చేసేందుకు, అక్కడున్న చెత్తను తరలించేందుకు ట్రాక్టర్లను వినియోగిస్తుండటంతో దీని ప్రభావం పారిశుద్ధ్య పనులపై పడుతోంది. ప్రైవేటు ప్లాట్లకు జరిమానా వేసి శుభ్రం చేయాల్సి ఉండగా ఎక్కడ కూడా అలా జరగడంలేదు.

**చర్యలు తీసుకుంటాం– జె.సువార్త, అదనపు కమిషనర్, కరీంనగర్ నగరపాలిక**

డివిజన్‌లలోని అంతర్గత వీధులలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా జవాన్లతో పర్యవేక్షణ పెంచడం జరుగుతుంది. తనిఖీల సందర్భంగా నిర్లక్ష్యం కనిపిస్తే చర్యలు తీసుకుంటాం.

# ఈఎస్ఐ మందులు పక్కదారి!



కరీంనగర్ : ఈఎస్ఐ ఆస్పత్రిలో రోగులకు ఇవ్వాల్సిన మందులను అక్రమంగా కరీంనగర్‌లోని ఓ మెడికల్ దుకాణంలో విక్రయిస్తుండగా అధికారులు పట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. ఆసిఫాబాద్ కుమురం భీం జిల్లాలోని సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రి ఉద్యోగి ఈ అక్రమానికి పాల్పడ్డా రు. ఈయన వాహనంలో రూ.4.87లక్షల విలువైన అయిదు రకాల మందులను మూడు రోజుల కిందట కరీంనగర్‌కు తీసుకొచ్చారు. రహస్యంగా కరీంనగర్ ఉస్మాన్‌పురలో ఉన్న ఓ మెడికల్ దుకాణంలో విక్రయిస్తుండగా ఔషధ నియంత్రణాధికారులు పట్టుకున్నారు. కొనుగోలు చేస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేశారు. వాహనంతోపాటు దొడ్డిదారిన విక్రయిస్తున్న ఔషధాలను స్వాధీనం చేసుకుని న్యాయస్థానా నికి అప్పగించారు. వీటిని విక్రయిస్తున్న ఉద్యోగిపై చర్యలు తీసుకో వాలని కోరుతూ ఈఎస్ఐ సంయుక్త సంచాలకుడికి ఔషధ నియంత్రణ శాఖ డీజీ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఉ న్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో ఆయనపై చర్యలు ఉండే అవకాశముంది. ఇంత పెద్ద మొత్తంలో ఔషధాలు పట్టుపడిన తీరుని అధికారులు సవాలుగా తీసుకుంటున్నారు. గతంలోనూ ఇదే విధంగా పలుచోట్ల విక్రయించి ఉంటారనే అనుమానంతో ఈ సంఘటనపై మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. పట్టుబడిన వ్యక్తుల నుంచి వాంగ్మూలాలు తీసుకోవడంతోపాటు వీరికి వచ్చిన సమాచారం ఆధారంగా పలు దుకాణాలపై కూడా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. కరీంనగర్ ఔషధ నియంత్రణశాఖ సహాయ సంచాలకులు ఎం.శ్రీనివా సులు నేతృత్వంలోని సిబ్బంది ఈ అక్రమ రవాణాపై కొన్ని రోజులుగా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వ్యక్తులు ఇచ్చిన సమాచా రంతో సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కరీంనగర్ వరకు వాహనాన్ని రహస్యంగా అనుసరిస్తూ ఫార్మసిస్టు సహా కొనుగోలుదారును పట్టుకు న్నారు. ఈ ఆపరేషన్‌లో కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కార్తిక్ భరద్వాజ్, శ్రవణ్, చందనతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కేసును ఔషధ నియంత్రణ శాఖ డీజీ కమలాసన్‌రెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

# దేవుడి భూమినీ వదలడం లే!

కరీంనగర్ : ఇది.. రాజీవ్ రహదారికి ఆనుకొని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయానికి చెందిన భూమి. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొన్నేళ్లుగా కుట్రలు జరిగాయి. స్థానికంగా ఉన్న యువత, గ్రామస్థులు ఈ భూమిని కాపాడేందుకు ఏళ్ల తరబడి పోరాటం చేశారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎట్టకేలకు భూమికి హద్దులు నిర్ణయించాలని కోర్టు ఆదేశించింది. ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్లో గుంటకు రూ.30 లక్షల దాకా ఉంటుంది. దేవుడి పేరిట రెండు వేర్వేరు సర్వే నెంబర్లలో ఇక్కడ 10.10 ఎకరాల భూమి ఉ ంది. ఈ భూమికి ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు హద్దులు నిర్ణయించి ప్రహరీ నిర్మిస్తే దేవుడి మాన్యానికి రక్షణ ఉంటుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు సంబంధించిన భూములు కాలక్రమేణా ఆక్రమణకు గురవుతున్నాయి. 1955–56 కాస్రా పహాణితో పోలిస్తే ఇప్పుడు రికార్డుల్లో ఉన్న విస్తీర్ణం తగ్గింది. దేవాదాయ శాఖ అధికారులు చెప్పిన వివరాల మేరకే 818 ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లాయి. ఇది ధరణి పోర్టల్‌లో ఉన్న ప్రస్తుత లెక్కల ప్రకారం. కాని అనధికారికం సుమారుగా 1500 ఎకరాల వరకు ఆలయాల భూమి కబ్జా చెరలో చిక్కుకున్నట్లు సమాచారం. ఆలయ భూములను ఆనుకుని ఉన్న వారు హద్దులు చెరిపేస్తూ ఆక్రమించడం, ఆ తరువాత కోర్టులను ఆశ్రయించడంతో ఏటా కొంత భూమిని దేవాదాయ శాఖ కోల్పోతూ వస్తోంది. అధికారులు మారుతుండటం, గ్రామాల్లో ఆలయ భూములెక్కడ ఉన్నాయో స్పష్టత లేకపోవడంతో సంరక్షణ కష్టసాధ్యమవుతోంది.

**ఊరూరా ఇదే తీరు..!**

హుజూరాబాద్ హనుమాన్ ఆలయానికి చెందినవి 1.14 ఎకరాలు, సిరిసిల్ల వేంకటేశ్వర స్వామి ఆలయ పరిధిలో 1.15 ఎకరాలు, పెద్దపల్లి గోశాలలో 1.13 ఎకరాలు, పెద్దపల్లి సీతారామస్వామి ఆలయ పరిధిలో 8.32 ఎకరాలు, జగిత్యాల రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిధిలో 2.04 ఎకరాలు, కోరుట్ల వేంకటేశ్వరస్వామి ఆలయానివి.. 20 గుంటలు, జగిత్యాల రాంమందిర్ భూమి 19 గుంటలు, పెద్దపల్లి నర్సింహాస్వామి భూమి 13.20 ఎకరాలు, కొండగట్టు ఆలయ భూములు రెండెకరాలు.. ఇలా అన్ని గ్రామాలు, పట్టణాల్లోని ఆలయ భూములు ఆక్రమణల్లో చిక్కుకున్నాయి. ఇందులో చాలామంది ఆక్రమణదారులు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో తిరిగి స్వాధీనం చేసుకోవడం యంత్రాంగానికి సవాలుగా మారుతోంది. కొన్ని కేసుల్లో దేవాదాయశాఖకు అనుకూలంగా తీర్పులు రావడంతో.. వీటిని సెక్షన్–84 ప్రకారం పోలీసులు, రెవెన్యూ సహకారంతో స్వాధీనపర్చు కుంటున్నారు.

**స్వాధీనం చేసుకుంటాం – సుప్రియ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా**

ఎట్టి పరిస్థితుల్లో దేవుడికి సంబంధించిన గుంట భూమిని కూడా ఆక్రమణదారులకు వదిలిపెట్టం. కచ్చితంగా స్వాధీనపర్చుకుంటాం. చాలా కేసుల్లో మా శాఖకు అనుకూలంగా తీర్పులు వస్తున్నాయి. త్వరలోనే రెవెన్యూ అధికారుల సహకారంతో సర్వేలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తాం. ఇదే సమయంలో ధరణి పోర్టల్‌లో ఉన్న రికార్డుల ఆధారంగా ప్రతి జాగాను కాపాడే ప్రయత్నం చేస్తున్నాం. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులకు లేఖ రాశాం.

# మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

శామీర్ పేట, (గరుడ వార్త) : అలియాబాద్ గ్రామంలో మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం శామీర్ పేట మండలం అలియాబాద్ గ్రామపంచాయతీ వద్ద మెడిసిటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా



పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 125 మందికి షుగర్, బీపీ, టెస్టులు చేయగా ఆపరేషన్, మరిన్ని పరీక్షలు అవసరము ఉన్న 40 మందిని ఆస్పత్రికి రిపేర్ చేశారు. వీరిని మెడిసిటీ ఆసుపత్రికి తరలించి ఉచిత ఆపరేషన్లు, పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమ ములో మాజీ ఉపసర్పంచ్ కమాటం కృష్ణారెడ్డి, వైద్యులు వినయ్, షాకీర్, సుచరిత, నిఖిత, నవ్య మార్కెటింగ్ ఇంచార్జి కుమారస్వామి, సత్యనారాయణ, శేఖర్ బాబు, రాకేష్, సాయి సుకేష్, పాల్గొన్నారు.

## శామీర్ పేట ను ప్రధాన మున్సిపాల్ కేంద్రం గా ఏర్పాటు చేయాలని వినతి

శామీర్ పేట, (గరుడ వార్త) : శామీర్ పేటకు ఎంతో చరిత్ర కలిగి ఉందని గ్రామస్తులు గుర్తు చేస్తూ, బుధవారం మున్సిపల్ ప్రధాన కార్యాలయంను శామీర్ పేట లో ఏర్పాటు చేయ్యాలని మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయం లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ. శామీర్ పేట గత 30 సంవత్సరాలుగా



మండల ఎమ్ ఆర్ ఓ కార్యాలయం, ఎమ్ డి ఓ కార్యాలయం, శామీర్ పేట సట్ రిజిస్టర్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఆరోగ్య సంరక్షణ కేంద్రం, జూలాజికల్ పార్క్, అంతర్జాతీయ కళాశాలలతో ఎంతో గుర్తింపు ఉందని తెలిపారు. ఆనాటి నుంచి శామీర్ పేట కు ఎంతో గుర్తింపు ఉన్నందున మున్సిపల్ ప్రధాన కార్యాలయం షామీర్పేటలోని ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో గ్రామస్తులు డి జి వెంకటేష్ గౌడ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా తంటం రాము గెలుపు..

### ప్రజలు ముఖ్యంగా యువత సమస్యల పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తా ...

### యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా తంటం రాము.

శామీర్పేట గరుడ వార్త ప్రజలు ముఖ్యంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన మేడ్చల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడి తంటం రాము అన్నారు. జరిగినటువంటి మేడ్చల్ నియోజకవర్గ యూత్



కాంగ్రెస్ ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉ పాధ్యక్షుడిగా తంటం రాము గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు అదేవిధంగా తన శామీర్పేట్ మండల్ అలియాబాద్ గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

ఇక మేడ్చల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉ పాధ్యక్షుడిగా ఎన్నికైన తంటం రాముకు అలియాబాద్ గ్రామస్తులు, షామీర్పేట్ మండల, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

# వ్యర్థాలతో వెలుగులు

హుజూరాబాద్: హుజూరాబాద్‌లో వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రెండు నగరపాలికలు, ఏడు పురపాలికల నుంచి సేకరించిన చెత్త నుంచి విద్యుత్తు తయారీకి ప్రణాళికలు సిద్ధం చేసింది. రోజుకు ఆరు మెగావాట్ల ఉత్పత్తితో ప్లాంటు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

**రూ.150 కోట్ల వ్యయంతో..**

హుజూరాబాద్ పురపాలికలోని కొత్తపల్లి శివారులో 25 ఎకరాల స్థలాన్ని సేకరించారు. రోజుకు 788.81 టన్నుల చెత్త నుంచి ఆరు మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు అవసరమైన అధ్యయనానికి సంబంధించిన ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న ప్లాంట్‌కు హుజూరాబాద్ పురపాలిక నుంచి 19.74 టన్నులు, జమ్మికుంట 18.64 టన్నులు, హుస్నాబాద్ 9.32 టన్నులు, పరకాల 10.32 టన్నులు, వరంగల్ నగరపాలిక 518.62 టన్నులు, కరీంనగర్ నగరపాలిక 186.07 టన్నులు, కొత్తపల్లి 4.67 టన్నులు, వర్ధన్నపేట 5.79 టన్నులు, నర్సంపేట నుంచి 15.64 టన్నుల చెత్తను తరలిస్తారు. ఈ చెత్త ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును యూనిట్‌కు రూ.6.80 పైసల చొప్పున జెన్‌కోకు విక్రయించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ మేరకు పురపాలకశాఖ నుంచి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్‌కు, జెన్‌కో ఎండీకి ప్రతిపాదనలు పంపించినట్లు తెలుస్తోంది. ప్లాంట్ ఏర్పాటుకు టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు



జరుగుతున్నాయి. ప్లాంట్ కోసం 25 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయని హుజూరాబాద్ పుర కమిషనర్ సమ్మయ్య తెలిపారు. సీడీఎంఏ నుంచి మార్గదర్శకాలు రాలేదన్నారు.

**తయారీ ఇలా..**

వ్యర్థాలను ఇక్కడి ప్లాంట్‌లో ఏర్పాటు చేసే గార్బేజ్ పిట్స్‌లో వారం పాటు ఆరబెడతారు.

అనంతరం క్రేన్ల సహాయంతో బర్నింగ్ బాయిలర్‌లో వేసి మాస్ ఇన్‌సినిరేషన్ విధానంలో 1,000 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతతో మండించి విద్యుత్తు ఉత్పత్తి చేస్తారు.

ఎన్ని బర్నింగ్ బాయిలర్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతిస్తుందనేది తెలియాల్సి ఉంది.

ఈ ప్లాంట్‌లో రోజుకు 790 టన్నుల చెత్తను మండించి ఆరు మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేలా ప్రణాళిక రచించారు.

ప్లాంట్‌లో చెత్తతో విద్యుత్తు ఉత్పత్తి ద్వారా మిగిలే బూడిద (యాష్)ను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశమున్నందున శాస్త్రీయ విధానంలో కేటాయించిన స్థలంలో గుంతలు తీసి జియోమెంబ్రన్‌షీట్‌లను వేసి వాటిలో పూడ్చనున్నారు.

అవసరమైతే బూడిదను ఇటుకల తయారీ, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు.

ఈ ప్లాంట్ నిర్మాణ క్రమంలో ఇంకా వివిధ శాఖల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.

ప్లాంటు అందుబాటులోకి వస్తే చెత్త సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

# ఎనిమిదేళ్లయినా.. అద్దె భవనాల్లోనే!

భువనగిరి : తెలంగాణ రాష్ట్రంలో నూతన జిల్లాల ఆవిర్భావం సందర్భం గా యాదాద్రి భువనగిరి కొత్త జిల్లా ఏర్పాటు చేసి శాంతిభద్రతల విభాగం మాత్రం రాచకొండ కమిషనరేట్ పరిధిలోకి యాదాద్రి జోన్‌గా చేర్చింది. యాదాద్రి జోన్ పరిధికి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్( డీసీపీ)ని జిల్లా పోలీస్ బాస్‌గా నియమించారు. ప్రజా రక్షణ, శాంతిభద్ర తలో కీలకమైన జిల్లా పోలీస్ కార్యాలయాలు మాత్రం నిర్మాణానికి నోచుకోలేదు. అద్దె భవనాలు, గతంలో ఉన్న ఇరుకైన పాత కార్యాలయా ల్లోనే కొనసాగుతున్నాయి. నూతన జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లు కావొస్తున్నా కొత్త కార్యాలయాలు నిర్మాణాలు జరగలేదు.

**పాత డీఎస్పీ కార్యాలయంలోనే..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో భువనగిరి డివిజన్ డీఎస్‌పీ స్థాయిలో ఉండేది. పట్టణంలోని బంజారాహిల్స్ కాలనీలో పాత డీఎస్పీ కార్యాల యంలోనే నూతన జిల్లా ఏర్పడిన తర్వాత డీసీపీ కార్యాలయం ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయి పోలీస్ కార్యాలయానికి సరిపోను లేనప్పటికీ అందులోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. రెండు అంతస్థులు ఉన్న భవనంలో కింద కార్యాలయం, పైన అధికారి నివాసానికి కేటాయించారు. ప్రస్తుతం జిల్లా డీసీపీ కార్యాలయానికి సంబంధించిన సీసీ, స్టాప్, కంట్రోల్‌రూం, సమావేశ మందిరాలు ఇరుకుగా ఉన్నా వాటిలో సర్దుబాటు చేసి నిర్వహిస్తున్నారు. ఆవరణలో తాత్కాలిక నిర్మాణం చేసి, కాన్ఫరెన్స్ మందిరం, ఎలక్షన్ సెల్, డీసీఆర్ సెల్‌లు నడుస్తున్నాయి.

జిల్లా స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించే వీలు లేకపోవడంతో ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోనే నిర్వహిస్తున్నారు.

డీసీపీతో పాటు అదనపు డీసీపీ పోస్టులు ఉన్నాయి. డీసీపీ పాత డీఎస్పీ కార్యాలయంలో ఉండగా అదనపు డీసీపీ కార్యాలయంలో భువనగిరి పట్టణ శివారులోని ఏఆర్ హెడ్‌క్వార్టర్ కార్యాలయంలో ఛాంబర్ కేటాయించారు. అయితే జిల్లా స్థాయి అధికారులు ఒకే ఆవరణలో లేకపోవడంతో వివిధ అంశాలపై నేరుగా సమన్వయం చేసే సమయంలో ఇబ్బందులు లేకపోలేదు. జిల్లా ఏర్పాటుతో జిల్లా సాయుధ బలగాలు(ఏఆర్) హెడ్‌క్వార్టర్స్, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, సొత్తు కేసులు ఛేదించే సీసీఎస్ విభాగాలన్నీ భువనగిరి శివారులోని ఓ వెంచర్ ప్రైవేటు భవనంలో కొనసాగుతున్నాయి.

జిల్లాలో నూతన మండలాలుగా ఏర్పాటు చేసిన అడ్డగూడూరు, మోటకొండూరు పోలీస్ స్టేషన్‌లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

స్థలం కేటాయించారా.. లేదా..

డీసీపీ క్యాంపు కార్యాలయం కోసం దాదాపు పది ఎకరాల స్థలం ప్రతిపాదన చేశారు. నూతన జిల్లా ఏర్పాటు తర్వాత పోలీస్ కార్యాలయాల కోసం స్థలం కేటాయిస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. భువనగిరి బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయం భవనం సమీపంలో డీసీపీ కార్యాలయానికి గతంలో స్థలం కేటాయించాలని ప్రతిపాదన చేశారు. అయితే స్థలం కేటాయింపునకు రెవెన్యూ అధికారులు అప్పట్లో సర్వే చేసి వదిలేశారు. కేటాయింపు ప్రక్రియను మాత్రం పూర్తి చేయలేదు. పోలీస్‌శాఖకు స్థలం కేటాయింపుపై తమకు అధికారికంగా ఎలాంటి లేఖలు, పత్రాలు అందించలేదని పోలీసుల అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయం చేసుకొని స్థలం కేటాయింపుపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

# ఎకరాల్లో చెరపట్టి.. గజాల్లో విక్రయించి



హైదరాబాద్: హైడ్రా కాస్త నెమ్మదించడంతో అక్రమార్కులు చెరువుల ఎఫ్‌టీఎల్‌లోనే భవనాలు నిర్మించి రాత్రికి రాత్రే వాటికి రంగులు వేస్తున్నారు. అధికారులు వచ్చినా అది పాత భవనంలా ఏమార్చడానికి సరికొత్త ప్రణాళిక అమలు చేస్తున్నారు. దీంతో రంగారెడ్డి జిల్లా పరిధి గండిపేట మండలంతోపాటు బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో అనేక చెరువుల్లో భారీ భవంతులు వెలుస్తున్నాయి. కొన్ని చోట్ల చెరువులకు ఆనుకొని విల్లాలు నిర్మించగా మరికొన్ని చోట్ల పెళ్లి మండపాలు నిర్మించారు. కిందిస్థాయి అధికారులు ఇందుకు తోడ్పాటు అందిస్తున్నారు. ఈ కబ్జాలపై హైడ్రా వేగంగా స్పందించక పోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇవీ ఉదాహరణలు**

కిస్మత్‌పూర్‌లోని ఎర్రగుంట చెరువు పరిస్థితి మరీ దారుణం. 15.06 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన చెరువు ఇప్పుడు 5 ఎకరాల్లోనే ఉంది. అంటే పది ఎకరాలు ఆక్రమణదారుల చెరలోకి వెళ్లిపోయింది. ఇక్కడ 20 వరకు విల్లాలు కూడా వచ్చాయి. ఒక వాటర్ ట్యాంక్ కూడా చెరువుకు ఆనుకునే నిర్మాణమైనా కూడా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

బండ్లగూడజాగీర్ పరిధిలోని బీజాపూర్ హైవేకు ఆనుకొని ఉన్న సర్వేనంబరు–10లో 34.29 ఎకరాల్లో పీరంచెరువు విస్తరించి ఉంది. అక్రమార్కులు 14.29 ఎకరాలను కబ్జా చేసి, చెరువు గర్భంలోనే లేఅవుట్ నిర్మించి గజాల చొప్పున విక్రయించారు. కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ ఎకరం నికరంగా రూ.50కోట్ల వరకు పలుకుతోంది. ఈ లెక్కన ఇప్పటికే రూ.735కోట్ల విలువైన చెరువు స్థలం కబ్జాకు గురైంది. తాజాగా ఓ అక్రమార్కుడు వెయ్యి గజాలకు పైగా చెరువు ఎఫ్‌టీఎల్ స్థలాన్ని మట్టితో నింపి చదును చేశారు. ఆ స్థలం తనదన్నట్లుగా బోర్డునూ పాతారు. సుమారు రూ.15 కోట్ల విలువైన స్థలం కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీరంచెరువులో కొందరు స్థిరాస్తి వ్యాపారులు నిర్మాణంలోని ఇళ్లకు సున్నం, రంగులు వేస్తున్నారు. ఒకవేళ అధికారులు కూల్చేందుకు వస్తే సున్నం, రంగును చూసి వెళ్లిపోతారన్న ఎత్తుగడ రచిస్తున్నారని పలువురుతో చెప్పారు. హైదర్షాకోట్‌లో 6.29 ఎకరాల ఎర్రకుంట నాలుగు ఎకరాలకుపైగా కబ్జాదారుల

చేతుల్లోకి వెళ్లడంతో చెరువు ఉనికిని కోల్పోయింది. ఎఫ్‌టీఎల్‌లోనే పది భవనాలను నిర్మించారు. పంచాయతీ అనుమతితో ఇక్కడ ఫంక్షన్‌హాల్ నిర్మాణ జరగడం విశేషం. అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడటం లేదు.గంధంగూడలోని కొత్త చెరువు ఉనికి కోల్పోయే పరిస్థితి వచ్చింది. 4.13 ఎకరాల్లో ఉండాల్సిన చెరువు ఇప్పుడు ఒక ఎకరంలోనే ఉంది. మూడు ఎకరాలను తమ కనుసన్నల్లోకి తీసుకుని ఏకంగా లే అవుట్ కూడా వేశారు.

# నిఘా నేల చూపులు

సిరిసిల్ల : నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) నిర్వహణ కరవై అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. మరమ్మతులు కరవై రూ.లక్షల విలువైన పరికరాలు వృథాగా మారాయి. కోతులు తీగలను తరచూ తెంపుతున్నాయి. దీంతో నిర్వహణ భారంగా మారడంతో వాటిని అలాగే వదిలేస్తున్నారు. జిల్లాలో 13 మండలాల పరిధిలోని ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నేరాల నియంత్రణతోపాటు కేసుల ఛేదనలో నిఘా నేత్రాలు కీలక పాత్ర పోషిస్తాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన కెమెరాలు నిర్వహణ లేక మరమ్మతులకు గురవుతున్నాయి. నేలవైపు చూస్తున్న కెమెరాల ఫలితంగా పలు నేరాల్లో నిందితుల కదలికలను గుర్తించడం ఇబ్బందిగా మారుతుంది. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, వీధుల్లో నిర్లక్ష్యంగా వదిలేయడంతో భద్రత ప్రశ్నార్థకంగా మారుతుంది. ప్రమాదాలు, నేరాలు జరిగినప్పుడు త్వరగా గుర్తించలేకపోతున్నారు. కేసుల దర్యాప్తు పోలీసులకు సవాల్‌గా మారుతుంది. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన కెమెరాలు నిర్వహణ లేక మూలన పడుతున్నాయి. పెద్ద సంఖ్యలో మరమ్మతులకు గురవుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు.



**బస్సుల్లో...**జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సుల్లో మహిళల భద్రతకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆకతాయిల చేష్టలను గుర్తించి ఆధారాలు సేకరించి చట్టపరమైన చర్యలకు ఉపయోగపడతాయని పెట్టారు. అలాగే అనుమానిత వ్యక్తులు, నిందితులను గుర్తించవచ్చు. కానీ చాలా బస్సుల్లో ఇవి పని చేయడం లేదు.వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు కంచర్ల, రంగంపేట, గర్జనపల్లిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ఇటీవల పోలీసులు మరమ్మతులు చేపట్టారు. సుభాష్‌నగర్ ప్రధాన కూడలి వద్ద, మిగతా గ్రామాల్లో సాంకేతిక కారణాల వల్ల పని చేయడం లేదు.

**నిర్వహణ లోపంతో...**

మండలంలో వ్యాపారులు, దాతల సహకారంతో ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో పోలీసులు 140 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిలో 80 పని చేస్తుండగా, మిగిలిన 60 పని చేయడం లేదు. వాటిని మరమ్మతులను పట్టించుకునే నాథుడు కరవయ్యాడు.ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి ప్రధాన బస్టాండు ప్రాంతమిది. వ్యాపార, వాణిజ్య కేంద్రమైన ఈ గ్రామంలో 4,500 మంది జనాభా ఉన్నారు. రోజూ రూ.కోట్లలో వ్యాపారం సాగుతుంటుంది. అయితే పోలీసులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం, దాతలు, ఇతర వ్యాపారుల భాగస్వామ్యంతో బస్టాండు ప్రాంతంతోపాటు ప్రధాన వీధుల్లో 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఏడాదిన్నర కిందట వీటిలో ఒకటి ధ్వంసమవగా, మిగతా 14 పని చేయక వృథాగా ఉన్నాయి. అయినా అటు పోలీసులు, ఇటు దాతలు పట్టించుకోలేదు.

మండలంలో ఇరవై మూడు గ్రామాలు ఉండగా 130 సీసీ కెమెరాలు ఉన్నాయి. బోయినపల్లి, కొదురుపాక గ్రామాల్లో పని చేయకపోవడంతో ఇటీవల మరమ్మతు చేయించారు. నర్సింగాపూర్ తదితర గ్రామాల్లో 20 కెమెరాలు పని చేయకపోవడాన్ని గుర్తించి మరమ్మతులు చేయిస్తున్నారు. మండలంలోని లింగన్నపేటలో 28 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా ఒక్కటీ పని చేయటం లేదు. నర్మాలలో 8 పని చేయటం లేదు. సముద్రలింగాపూర్‌లో పూర్తిగా మూలకు చేరాయి. మిగతా గ్రామాల్లో సగం మాత్రమే పని చేస్తున్నాయి. సిరిసిల్ల పట్టణంలో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. నిందితులను పట్టుకోవడంలో నిఘా నేత్రాలు కీలకంగా పని చేస్తాయి. ప్రగతినగర్, బతుకమ్మ ఘాట్ సమీపం తదితర ప్రాంతాల్లో పని చేయడం లేదు.

మండలంలో నిమ్మపల్లి, కోనరావుపేట, వట్టిమల్ల, మరిమడ్ల గ్రామాల్లో పలు దొంగతనాలు జరిగాయి. సీసీ కెమెరాలు పని చేయక నేటికీ ఆధారాలు లభించలేదు. ధర్మారం, మంగళ్లపల్లి, మల్కపేట, కొలనూర్, మర్తన్‌పేట గ్రామాల్లో కొత్తగా ఏర్పాటు చేశారు.

అలంకారప్రాయంగా...ముస్తాబాద్: మండలంలో 22 గ్రామాలు ఉండగా 200 పైగా సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటి తీగలను కోతులు తరచూ తెంపుతున్నాయి. దీంతో అవి పని చేయడం లేదు.

బాగానే పని చేస్తున్నాయిజిల్లాలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. కొన్ని మినహా మిగతావి బాగానే పని చేస్తున్నాయి. చెడిపోయిన వాటికి మరమ్మతులు చేయిస్తున్నాం.అఖిల్ మహాజన్, ఎస్పీ

# ‘ముప్పే’ట దాడి!



పెద్దపల్లి : జనాభాతో పాటే పెరుగుతున్న కాలుష్యం మానవాళికి శాపంగా మారింది.. ప్రకృతి ప్రసాదమైన గాలి, నీరు, నేల తదితర సహజ వనరులన్నీ కలుషితమవుతున్నాయి.. ఇప్పటికైనా ప్రమాదం గుర్తించకపోతే మున్ముందు గడ్డు పరిస్థితులే.. ఇంధనాల వినియోగం తగ్గించడం, పచ్చదనం పెంచడం, ప్రత్యామ్నాయ మార్గాలు అవలంబించడమే అందరి లక్ష్యం కావాలి..

**జల గరళం**

సమస్య: జల కాలుష్యం అధిక వ్యాధులకు కారణమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన గోదావరి నది, మానేరు తదితర వాగుల నీరు కలుషితమవుతోంది. ధర్మపురి, గోదావరిఖని, మంథని ప్రాంతాల్లో గోదావరిలో మురుగు కలుస్తుండగా, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ తదితర పరిశ్రమల నుంచి వ్యర్థాలను నేరుగా జల వనరుల్లోకే వదులుతున్నారు. మరోవైపు వ్యవసాయంలో విచ్చలవిడిగా ఎరువుల వాడకంతో నీటితో పాటు పంట ఉత్పత్తులు కలుషితమవుతున్నాయి. భూసారం దెబ్బతింటోంది.

**ప్రభావం**

నీటి కాలుష్యంతో శరీరంపై దురద, దద్దుర్లు, ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. పరిశ్రమల పరిసరాల్లో బోర్ల నుంచి కలుషిత జలం వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో నీటిలో నైట్రేట్ శాతం పెరగడంతో భూసారంపై ప్రభావం చూపుతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రమాదకర ఫ్లోరైడ్ లక్షణాలు లేకున్నా ఫ్లోరైడ్ శాతం కొద్దిగా పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పరిష్కారం**

పారిశ్రామిక వ్యర్థాలను గోదావరిలో కలవకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలి. వ్యర్థాలను శుద్ధి చేయడానికి ఎస్టీపీ(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు)లు నిర్మించుకోవాలి. ఉమ్మడి జిల్లాలో 12.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగువుతున్నా, అందులో 2 శాతం కూడా సేంద్రియ విధానంలో సాగు చేయడం లేదు. ఈ దిశగా ప్రభుత్వం రైతుల్లో చైతన్యం కల్పించాలి.

**ప్లాస్టిక్ భూతం**

సమస్య: తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్లతో పర్యావరణానికి పెను విఘాతంగా మారింది. కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థలతో పాటు 14 పురపాలికల్లో రోజుకు 300 టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి అవుతుండగా అందులో సింహ భాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి.

**ప్రభావం**

ప్లాస్టిక్ వ్యర్థాలు వనరులను ముంచెత్తుతున్నాయి. క్యాన్సర్, రక్తహీనత, క్షయ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మూగజీవాల కడుపుల నుంచి వందలాది పాలిథీన్ కవర్లు బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. భూసారం తగ్గుతోంది.

**పరిష్కారం**

ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా చైతన్యం కల్పించాలి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. పాలిథిన్ కవర్లకు ప్రత్యామ్నాయంగా జ్యూట్ సంచుల వాడకాన్ని ప్రోత్సహించాలి. క్యారీ బ్యాగుల తయారీని ప్రభుత్వం నియంత్రించాలి. ప్లాస్టిక్ వ్యర్థాలను ఉక్కు, ఇతర పరిశ్రమల్లో ఇంధనంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలి.

**ప్రాణాలు తీస్తున్న వాయువు**

సమస్య: పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే పొగ.. గ్రానైట్ క్వారీలు, రైస్ మిల్లుల నుంచి వెలువడే దుమ్ము, ధూళి వాయు కాలుష్యానికి ప్రధాన కారకాలు. ఉమ్మడి జిల్లాలో 1,378 చిన్నతరహా, 54 మధ్యతరహా పరిశ్రమలున్నాయి. నాలుగు జిల్లాల్లో నిత్యం 10.30 లక్షల వాహనాలు నిత్యం రోడ్డెక్కుతున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గ్రానైట్ పరిశ్రమల వెలువడుతున్న దుమ్ముతో ఊపిరాడటం లేదు.

**ప్రభావం**

ఊపిరితిత్తుల సంబంధిత ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. నైట్రోజన్ డయాక్సైడ్ కారణంగా కళ్లు, ముక్కు మండుతున్నాయి. అమ్మోనియా మోతాదు పెరిగితే కళ్ల మంట, శ్వాస వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. వాహనాల పొగ శ్వాసకోశ వ్యవస్థను దెబ్బతీస్తోంది.

**పరిష్కారం**

తరచూ తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి. పారిశ్రామిక ప్రాంతాల్లో పచ్చదనం పెంచాలి. సౌర విద్యుత్తును, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.

**ముప్పై ఏళ్లుగా సైకిల్‌నే వాడుతున్నా**

నా వంతుగా వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ద్విచక్రవాహనాన్ని వాడొద్దని నిర్ణయించా. ముప్పై ఏళ్లుగా ఎటు వెళ్లాలన్నా సైకిల్‌నే వాడుతున్నా. మూడేళ్లు రామగుండంలో విధులు నిర్వర్తించినా పెద్దపల్లి నుంచి సైకిల్‌పైనే వెళ్లా. వ్యాయామంతో ఆరోగ్యానికి బాగుంటుంది. బి.నర్సింగం, రైల్వే విశ్రాంత ఉద్యోగి, పెద్దపల్లి

**సౌర విద్యుత్తుతో బిల్లు భారం తగ్గింది**

నేను నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలకు నెలకు రూ.7 వేల విద్యుత్తు బిల్లు చెల్లించేవాళ్లం. అయిదేళ్ల కిందట భవనంపై 5 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర పలకలు ఏర్పాటు చేశా. సొంత అవసరాలకు పోను నాలుగైదు నెలలకోసారి ట్రాన్స్‌కో నుంచి రూ.3 వేల ఆదాయం వస్తోంది. వినయ్‌కుమార్, కమాన్‌పూర్

**సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు**

పది ఎకరాల్లో మామిడి, రెండు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. పన్నెండేళ్లుగా సేంద్రియ పద్ధతిలో పంటలు వేస్తున్నా. ఆవు మూత్రం, వేప, వివిధ మొక్కల ఆకులు, పేడ, ఇతర పదార్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని వినియోగిస్తున్నా. భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తున్నాయి. మిట్టపెల్లి రాములు, తుంగూర్, బీర్‌పూర్ మండలం

**ఆదర్శం సుల్తాన్‌పూర్**

ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ పంచాయతీ ప్లాస్టిక్ నిషేధంలో ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడ 1,100 జనాభా ఉండగా 2019లో అప్పటి సర్పంచి వెంకటేశ్వర్‌రావు ప్రత్యేక చొరవ చూపారు. ఇంటింటికీ నానో ఓవన్ సంచుల పంపిణీతో పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. మొక్కల పెంపకంతో ఊరంతా పచ్చదనం నిండింది.

# ధరణి దరఖాస్తులకు మోక్షం..!

నల్గొండ : ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. జిల్లా కలెక్టర్ స్థాయిలో ఇన్నాళ్లూ ఉన్న అధికారాలను విభజించి పలు సమస్యలకు సంబంధించి పరిష్కార బాధ్యతలను అదనపు కలెక్టర్(రెవెన్యూ), రెవెన్యూ డివిజన్ అధికారి(ఆర్డీవో)లకు అప్పగించింది. కలెక్టర్ వద్దే ధరణికి చెందిన అన్ని అధికారాలు ఉండిపోవడంతోనే సమస్యలు పేరుకుపోతున్నట్లు ధరణి కమిటీ గుర్తించింది. దీంతో ప్రభుత్వం పలు సమస్యలను విభజించి అధికారులకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**అదనపు కలెక్టర్ పరిష్కరించేవి**

జిల్లా కలెక్టర్‌తో సంబంధం లేకుండా ఇకపై అదనపు కలెక్టర్ వద్ద అయిదు రకాల సమస్యలు పరిష్కారం కానున్నాయి. నాలుగు మాడ్యూళ్ల ద్వారా వచ్చే దరఖాస్తులను తహసీల్దార్, ఆర్డీవోకు పంపించనున్నారు. వారు ఆయా సమస్యలను పరిశీలించి అదనపు కలెక్టర్‌కు పంపిస్తారు. వారు చేసిన సిఫార్సులను పరిశీలించిన పిమ్మట ఆ సమస్యను పరిష్కరిచడం లేదా తిరస్కరించడం చేస్తారు. తిరిస్కరిస్తే దరఖాస్తుదారుడికి స్పష్టమైన సమాధానం ఇవ్వనున్నారు.

యాజమాన్య హక్కు బదిలీ దరఖాస్తులు(టీఎం3–మ్యుటేషన్)

కోర్టు కేసులతో ముడిపడి ఉండే భూములకు పట్టా పాసుపుస్తకాలకు వచ్చేవి(టీఎం24)పట్టా పాసుపుస్తకం లేదా వ్యసాయేతర భూమిగా మార్చడానికి ఆటంకంగా రికార్డుల్లో గృహం, హౌజ్ సైట్ అని నమోదైన వాటికి సంబంధించినవి (టీఎం31)

పాసుపుస్తకం సమాచారంలో తప్పుల సవరణ(టీఎం33)

పేరు మార్పిడి కోసం వచ్చిన దరఖాస్తులు(టీఎం33)

ఆర్డీవో పరిష్కరించేవి..

కు డిజిటల్ సంతకాలకు వచ్చినవి(టీఎం33, జీఎల్ఎం)

వారసత్వ బదిలీ దరఖాస్తులు(టీఎం4)ఎసైన్డ్ భూములకు(పాసుపుస్తకం లేనివి) సంబంధించినవి(టీఎం27)వ్యసాయేతర భూముల మార్పిడికి సబంధించి(టీఎం27) సర్వే నంబర్ల

# ఉపాధి పనుల జాతర



గరిడేపల్లి : ఉపాధి హామీ పథకంలో ఉమ్మడి జిల్లాలో నాలుగు నెలల్లో దాదాపు రూ.222 కోట్ల విలువైన పనులు చేయాలని లక్ష్యం నిర్దేశించారు. నవంబరు 21న ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతులు తీసుకున్న పనులను డిసెంబరు ఒకటి నుంచి పూర్తి స్థాయిలో ప్రారంభించాలని నిర్ణయించారు. ముందస్తుగా పనుల జాతర పేరుతో ఈనెల 26న మండలానికి ఒక పని చేయాలని రాష్ట్రవ్యాప్తంగా పనులు మొదలుపెట్టారు. ఈ పనులన్నీ వచ్చే ఏడాది 2025 మార్చి 31 నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. మండల స్థాయి అధికారులు పంపిన ప్రతిపాదనలకు జిల్లా అధికారులు 90 శాతం అనుమతులు మంజూరు చేశారు. వీటిని ప్రారంభించనున్నారు.

ఐదు విభాగాలుగా కేటాయింపు

సాగర్ ఆయకట్టులో ఎక్కువగా ఉండే పనులు, కాల్వలేని భువనగిరి, నల్గొండ జిల్లాలో చేపట్టే పనులను గుర్తించారు. ప్రధానంగా ఐదు విభాలుగా చేసి పనులు కేటాయించారు. పొలంబాట, వన మహోత్సవం, జలనిధి, గ్రామీణ పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా వీటిని చేపట్టాలని నిర్దేశించారు.

# ఉల్లంఘించిన రోజులూ లెక్కలోకి!

హైదరాబాద్: కాలుష్య పరిశ్రమలు, ఆర్ఎంసీలపై పీసీబీ కొరడా ఝులిపిస్తోంది. ఉల్లంఘనల కాలాన్ని లెక్కగట్టి పర్యావరణ నష్టాన్ని వసూలు చేస్తోంది. ఈ ఏడాదిలో 70కి పైగా పరిశ్రమలు, నిర్మాణ రంగ ప్రాజెక్టులపై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకోగా అందులో 20కి పైగా నిర్మాణ రంగ ప్రాజెక్టుల్లో ఆర్ఎంసీ(రెడీ మిక్స్ కాంక్రీట్)లను గుట్టుగా నడపడంపై ఫిర్యాదులు అందాయి. టాస్క్‌ఫోర్స్ బృందం ఆయా ప్రాజెక్టుల్లో తనిఖీలు జరిపి కాలుష్య ఉద్గారాల స్థాయిని లెక్కగట్టి చర్యలు తీసుకుంది.

**వసూలు ఇలా..**

కూకట్‌పల్లిలోని ఆర్ఎంసీ నిర్వాహకులపై కాలుష్య నియంత్రణ మండలి ఇటీవల చర్యలు తీసుకుంది. నిబంధనలు ఉల్లంఘించిన 144 రోజులను లెక్కగట్టి రూ.10,80,000 చెల్లించాలని ఆదేశించింది. పొల్యూషన్ ఇండెక్స్(30), నిబంధనల ఉల్లంఘన కాలం(144), లొకేషన్ ఫ్యాక్టర్ (2.0), ఆర్ఎంసీ చిన్నది కావడంతో స్కేల్ ఆఫ్ ఆపరేషన్ (0.5) ఫ్యాక్టర్ ఆఫ్ రూపీస్ (250)గా లెక్కగట్టి నగదు 15 రోజుల్లో చెల్లించాలని ఆదేశించింది.

**ఎలా లెక్కిస్తారంటే..**

పొల్యూషన్ ఇండెక్స్‌ను సున్నా నుంచి 100 మధ్యలో లెక్కిస్తారు. రెడ్ కేటగిరీ అయితే 60 - 100, ఆరెంజ్ కేటగిరీ అయితే 41 - 59,




గ్రీన్ కేటగిరీ అయితే 21 - 40 మధ్య పరిగణిస్తారు. లొకేషన్ ఫ్యాక్టర్ (ప్రాంతీయత)లో పదిలక్షల వరకు జనాభా ఉంటే 1.0గా, ఐదు మిలియన్ల మధ్య ఉంటే 1.25, 10 మిలియన్ల లోపు ఉంటే 1.5, పది మిలియన్లకు పైగా ఉంటే 2.0గా లెక్కిస్తున్నారు. ఫ్యాక్టర్ ఇన్ రూపీస్‌లో భాగంగా 100 నుంచి 500 వరకు లెక్కిస్తుండగా..నిబంధనల ఉల్లంఘనల అంశంలో 250గా లెక్కించాలని సీపీసీబీ సూచించింది.

**బ్యాంకు గ్యారంటీలు**

బాచుపల్లిలో లెదర్ ఫినిషింగ్, ట్యానింగ్ రసాయనాలు తయారు చేస్తున్న పరిశ్రమపై చర్యలు తీసుకుంది. కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్ నిబంధనలకు విరుద్ధంగా నడుచుకోవడంతో కాలుష్య ఉద్గారాల స్థాయి పెరుగుదలకు కారణమైనందుకు తాజాగా మరోసారి రూ.6లక్షల బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని ఆదేశించింది. ఫర్నేస్ ఆయిల్‌కు బదులుగా పీఎన్జీ ఇంధనం వినియోగించాలని, అమ్మోనియాకు బదులు ప్రత్యామ్నాయ రసాయనాన్ని వినియోగించాలని సూచించింది.

# భగీరథ జలం.. పరిశ్రమకు ఊతం

వికారాబాద్ : మిషన్ భగీరథ పథకం తాగునీటి అవసరాలతోపాటు పరిశ్రమలకూ ఉపయోగపడుతోంది. వాటికి నీటిని కేటాయించేందుకు గ్రిడ్ అధికారులు ముందుకొచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూమి, నీటి సదుపాయం, విద్యుత్తు ప్రధాన అవసరాలు. పూడూరు మండలం రాకంచర్ల దగ్గర పారిశ్రామిక వాడ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం భూమి కేటాయించింది. సోలార్, పవన విద్యుత్తు వంటి ప్రైవేట్ విద్యుత్తు సంస్థలు అందుబాటులోకొచ్చాయి. పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి 10 శాతం నీరు సరఫరా చేస్తామని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. పరిగి మండలం రాఘవాపూర్ సమీపంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి ప్లాంటుకు శ్రీశైలం బ్యాక్‌వాటర్ సరపరా అవుతోంది.

**దరఖాస్తులు తక్కువే..**

పరిగి మండలం రాఘవాపూర్ వద్ద 135 ఎంఎల్‌డీ, చేవెళ్ల మండలం అంతారం వద్ద 40 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న సంపులున్నాయి. ఆ రెండింటి ద్వారా దాదాపు 17.5 ఎంఎల్‌డీ నీటిని పరిశ్రమలకు, ఇతర అవసరాలకు కేటాయించేందుకు అవకాశముంది. వీటిలో ఇప్పటి వరకు శుద్ధి చేయని నీరు 37 లక్షలు, శుద్ధి చేసింది 15 లక్షల లీటర్ల వరకు వినియోగిస్తున్నారు. పరిగి, శంకర్‌పల్లి ప్రాంతాల్లోని పరిశ్రమలకు ఈ నీటిని వాడుతున్నారు. వెయ్యి లీటర్లకు రోజుకు రూ.150 చొప్పన, వాణిజ్య అవసరాలకు రూ.90 చొప్పున వసూలు



చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భగీరథకు నెలకు రూ.45 లక్షల ఆదాయం సమకూరుతోంది.

**రాకంచర్లలో ఏర్పాటైతే ఉపయోగం..**

రాకంచర్ల దగ్గర పారిశ్రామికవాడ ఏర్పాటుకు 113 ఎకరాలు కేటాయించినా ఎవరూ ముందుకు రాలేదు. రూ.30 కోట్లు వెచ్చించి రోడ్లు, విద్యుత్తు సౌకర్యం కల్పించారు. ఉపాధి కోసం కొందరు మహిళలు రంగారెడ్డి జిల్లా కొందుర్గు సమీపంలోని బిస్కెట్ కర్మాగారాల్లో పనికి వెళుతున్నారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటైతే ఇలాంటి వారికి ఉపాధి దొరుకుతుంది. అన్ని వసతులుండడంతో పరిశ్రమల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహించాలని స్థానికులు కోరుతున్నారు. పరిశ్రమల వారు శుద్ధి చేయని నీటిని అడిగితే ప్రత్యేకించి పైప్‌లైన్ వారే ఏర్పాటు చేసుకోవాలి. శుద్ధి నీటిని మాత్రం అందుబాటులో ఉన్న వనరుల ద్వారా అందించనున్నారు. **అవకాశాలను బట్టి కేటాయిస్తాం..: చల్మారెడ్డి, ఈఈ, మిషన్ భగీరథ (గ్రిడ్)**మిషన్ భగీరథ నీటిని పారిశ్రామిక అవసరాలకు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటివరకు పరిగిలో ఒక కంపెనీ వాడుతుండగా తాండూరు, వికారాబాద్ నుంచి ఎవరికీ ఇవ్వలేదు. మోమిన్‌పేట మండలం ఎన్కతల నుంచి అడిగారు. స్థానికంగా ఉన్న వనరులనుబట్టి కేటాయిస్తాం.

# ఇందిరమ్మ ఇళ్లకు సన్నాహాలు



సిరిసిల్ల : ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో ఈ పథకం విజయవంతం కావాలంటే జిల్లాలో ప్రత్యేక యంత్రాంగం అవసరం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో ఈ శాఖలో పని చేసిన 50 మంది సిబ్బంది పలు శాఖలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. అయితే వీరిలో చాలా మంది ఉద్యోగ విరమణ పొందగా, మరి కొందరు మృతి చెందారు. ప్రస్తుతం ఆయా శాఖల్లో పని చేస్తున్న వారిని మాతృ శాఖలోకి తీసుకునే ప్రక్రియ ఈ నెలాఖరులోపు పూర్తికానుంది. జిల్లాల వారీగా గృహ నిర్మాణశాఖ కార్యాలయాలను ప్రారంభిస్తారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 గృహాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిలో ఉమ్మడి జిల్లాకు 45,500 ఇందిరమ్మ గృహాలు రానున్నాయి. సొంత స్థలం ఉన్న వారికి తొలుత ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాకు రూ.2 వేల కోట్ల పైనే నిధులు వచ్చే అవకాశం ఉంది.

**అధికారులదే కీలక బాధ్యత**

ఈ పథకం అమలుకు జిల్లా స్థాయిలో పీడీలు, ఈఈలు, డీఈలు, అలాగే మండలాల్లో ఏఈలు కీలక బాధ్యత పోషించాల్సి ఉంటుంది. గతంలో మండలాల వారీగా పొరుగుసేవల విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు కూడా పని చేశారు. ఇప్పటికే సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో నలుగురు డీఈలు, ఏఈలు చేరారు. జగిత్యాల, పెద్దపల్లి నుంచి ఒక్కొక్కరు మాత్రమే వచ్చారు. డిప్యుటేషన్‌లో పని చేస్తున్న హెచ్ఎండీఏ తదితర శాఖల నుంచి రిలీవ్ కావాలి. మరోవైపు వారు గృహ నిర్మాణశాఖలో చేరాల్సిన జిల్లాలను ఎంపిక చేసుకోవాలి. జిల్లా స్థాయిలో ఈఈ, ఇద్దరు డీఈలు, ఏఈలు ఉంటారు. ప్రతి జిల్లాకు హౌసింగ్ అధికారి, మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్‌లను నియమిస్తారు. ఇలా డివిజన్‌లు, నియోజకవర్గాల వారీగా ఇంజినీర్లు, కార్యాలయ సిబ్బందిని కేటాయిస్తారు.

**తప్పిదాలు పునరావృతం కాకూడదని...**

గతంలో ఇందిరమ్మ గృహాల మంజూరు, నిర్మాణం, నిధుల విడుదలలో అవకతవకలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో రూ.17.50 కోట్ల మేరకు దుర్వినియోగమైనట్లు అప్పట్లో ప్రత్యేక విచారణ బృందం నివేదికలో వెల్లడైంది. తర్వాత దీనిపై ఎలాంటి కదలికలేదు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో అవకతవకలకు అవకాశం లేకుండా ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. దీనిని ప్రభుత్వం ఈ వారంలో లాంఛనంగా ప్రారంభించనుంది. ఇప్పటికే ఈ యాప్‌తో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని గృహ నిర్మాణశాఖను ప్రభుత్వం బలోపేతం చేస్తుంది.

**చొప్పదండిలో అసంపూర్తిగా నిర్మాణం**

చొప్పదండిలోని పాత వెదురుగట్ట రోడ్‌లోని రెండు పడక గదుల పరిస్థితి ఇది. ఏడేళ్ల కిందట 93 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయగా 50 ఇళ్లకు స్లాబుతోపాటు గోడలు పూర్తి చేశారు. మరో 43 ఇళ్లకు మూడు అంతస్తుల్లో నిర్మాణం చేసినా.. పూర్తి స్థాయిలో గోడలు నిర్మించలేదు. అయిదేళ్ల నుంచి పనుల్లో అడుగు పడటంలేదు. నిధులు రాకపోవడంతో గుత్తేదారు వదిలేశారు. చొప్పదండి వాసులకు సొంతింటి కల నెరవేరకుండా పోయింది.

**రెండేళ్లుగా బిల్లుల పెండింగ్**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వంలోని రెండు పడక గదుల నిర్మాణాలు అసంపూర్తి దశలో ఉన్నాయి. 2021 లోపు నిర్మాణం జరిగినవే చాలా వరకు పూర్తయ్యాయి. వాటినే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కొన్ని చోట్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకే పరిమితమైంది. అసంపూర్తి పనులను పూర్తి చేసేందుకు 2023 వరకు పలుమార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రాలేదు. మరోవైపు పనులు చేసిన గుత్తేదారులకు సైతం రెండేళ్లుగా బిల్లులు రావడం లేదు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు రూ.25 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు ఉన్నట్లు సమాచారం.

# రూ.4వేలిస్తే.. గుర్తింపు 'పది'లం




హైదరాబాద్ : " పాతబస్తీలో ఓ ప్రైవేటు పాఠశాలలో మార్చిలో 210 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఉత్తీర్ణతశాతం అత్యల్పంగా రావడంతో ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి విచారణ చేపట్టగా.. చార్మినార్ సమీపంలోని మూడు గుర్తింపులేని ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులను ఆ బడిలో చేర్చారు." ఈ వ్యవహారంలో బాధ్యుడైన అధికారిని ప్రాంతీయ విద్యాశాఖ సంచాలకులు కొద్దిరోజుల క్రితం సస్పెండ్ చేశారు. మరికొన్ని మండలాల్లోనూ ఈ అక్రమాలు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వ గుర్తింపులేని పాఠశాలల యాజమాన్యాలు... కొందరు విద్యాశాఖ అధికారులు కలిసి పదో తరగతి విద్యార్థులను మోసం చేస్తున్నారు. గుర్తింపులేని పాఠశాలల్లో చదువుకుంటున్న వారికి పదోతరగతి పరీక్షలు రాసేందుకు అర్హత లేకపోయినా... విద్యార్థి నుంచి డబ్బులు వసూలు చేసి... గుర్తింపున్న మరో ప్రైవేటు పాఠశాలలో పేర్లు నమోదు చేస్తున్నారు.

**'యూడైస్'లో నమోదు తప్పనిసరి కావడంతో..**

సైదాబాద్, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ముసారాంబాగ్, పాతబస్తీ, ఆసిఫ్‌నగర్, లంగర్‌హౌస్, అమీర్‌పేట, సికింద్రాబాద్ ప్రాంతాల్లో గుర్తింపు లేని పాఠశాలలున్నాయి. విద్యార్థులు పదోతరగతికి రాగానే 'ప్రైవేటు' అభ్యర్థులుగా పరీక్షలు రాయిస్తున్నారు. 'యూడైస్' పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలంటూ సర్కారు ఆదేశాలు జారీచేయడంతో గుర్తింపులేని పాఠశాలల యాజమాన్యాలకు ఇబ్బందులు మొదలయ్యాయి. వాటి వివరాలు పోర్టల్‌లో నమోదు చేసేందుకు అవకాశం లేకపోవడంతో గుర్తింపు ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో 'పది' విద్యార్థుల పేర్లను చేర్పిస్తున్నారు. అందుకు ఒక్కొక్కరి నుంచి రూ.4వేలు వసూలు చేస్తున్నారు. అందులో రూ.3వేలు గుర్తింపున్న ప్రైవేటు పాఠశాలకు, రూ.వెయ్యి విద్యాశాఖ అధికారులకు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**పర్యవేక్షణ లేమితోనే...** గుర్తింపులేని పాఠశాలల జాబితాను ప్రభుత్వ, మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద ప్రచురించాలి. ఏటా విద్యాసంవత్సరం ఆరంభంలో ప్రైవేటు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి సహా డిప్యూటీ ఈవోలు, మండల విద్యాధికారులు తనిఖీలు నిర్వహించాలి. అందుకు విరుద్ధంగా విద్యాశాఖ అధికారులు తనిఖీలకు దూరంగా ఉంటున్నారు. గుర్తింపులేని పాఠశాలల యాజమాన్యాలు సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల పేర్లను రాయిస్తున్నారు. చార్మినార్ ప్రాంతంలోని గుర్తింపులేని పాఠశాలల విద్యార్థుల పేర్లు బహదూర్‌పురలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఉన్నాయి. కిందిస్థాయిలో కొందరు విద్యాశాఖ అధికారులకు ఈ విషయం తెలిసినా.... రాజకీయ ఒత్తిళ్లు, ఉన్నతాధికారుల ఆదేశాలతో మిన్నకుండిపోతున్నారు.

# మందులా.. మతాబులా!

హైదరాబాద్ : నగరంలో ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న ఔషధ దుకాణాలు రోగులను దోపిడీ చేస్తున్నాయి. నిర్ణీత ధర కంటే భారీగా వసూలు చేస్తూ జేబులకు చిల్లు పెడుతున్నాయి. మలక్‌పేట్ జడ్డికాలనీలోని హైదరాబాద్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో డీసీఏ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఒక్కో ఔషధం ఏకంగా 12-15 రెట్లు అధిక ధరలకు విక్రయించడాన్ని గుర్తించారు. అలెర్జీ కోసం వాడే అవిల్ ఇంజక్షన్ ఎమ్మార్పీ రూ.6.16 అయితే ఇక్కడ రూ.100 వసూలు చేస్తున్నారు. కొన్ని దుకాణాల్లో ఎమ్మార్పీపై 10-20 శాతం రాయితీ సైతం ఇస్తుంటారు. అయితే ఆసుపత్రుల అనుసంధానంగా ఉన్న దుకాణాలు ఈ నిబంధనలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇష్టారీతిన ధరలు వేసి రోగుల నుంచి డబ్బులు గుంజుతున్నారు.

**ఎక్కువకు అమ్మితే కేసులు నమోదు చేస్తాం**

ఔషధాలపై ఉన్న ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం. డ్రగ్స్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్, 2003 ప్రకారం ఎమ్మార్పీలోపే రోగులకు ఔషధాలు విక్రయించాలి. ఈ ఆర్డర్‌ను తుంగలోకి తొక్కితే



ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్టు 1955 ప్రకారం జైలు శిక్ష సైతం పడుతుంది. ఎక్కడైనా ఎక్కువ ధరకు ఔషధాలు విక్రయించినట్లు ప్రజలు గుర్తిస్తే ఔషధ నియంత్రణ శాఖ దృష్టికి తేవాలి. టోల్‌ఫ్రీ నెంబరు 1800-599-6969 ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం. వి.బి.కమలాసన్‌రెడ్డి, డైరెక్టర్ జనరల్, ఔషధ నియంత్రణ శాఖ

# సాఫీ ప్రయాణానికి దారేదీ..?

హైదరాబాద్: నగరంలో అనేక చోట్ల రైల్వేక్రాసింగ్‌లు ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. దాదాపు 42 చోట్ల ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి), ఆర్‌వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణ, విస్తరణ పనులు చేపట్టి పరిష్కారం చూపాల్సిన యంత్రాంగంలో చలనం లేదు. జీహెచ్ఎంసీ సైతం వీటిపై అధ్యయనం చేసినా, పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

**ఈ ప్రాంతాలు కీలకం..**

ఖైరతాబాద్ రైల్వేగేట్ సమీపంలో ఆర్‌యూబీ తెరవాల్సి ఉంది. 30 ఏళ్ల క్రితం ఇక్కడి నుంచే రాకపోకలు సాగేవి. ప్రస్తుతం రైల్వేగేట్ నుంచి వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. మెట్రో కారణంగా ఈ మార్గంలో రద్దీ ఎక్కువైంది. రైలు వచ్చినపుడల్లా 5-8 నిముషాలు గేటు వేయాల్సి వస్తోంది. దీంతో అనేక మంది గేటు కింది నుంచి ప్రమాదకరంగా దాటుతున్నారు.

బొల్లారం రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్‌యూబీ ప్రతిపాదన ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. ప్రాజెక్టు వ్యయం రూ.136 కోట్లు కాగా, కేంద్రం రూ.19.33కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 117.4 కోట్లు ఖర్చు చేయాల్సి




ఉంది. ఇప్పటి వరకు అలైన్‌మెంట్ ప్రణాళిక సిద్ధం కాలేదు.

ఆర్‌కేపురం-తిరుమలగిరి మార్గంలో ఆర్‌వోబీ విస్తరించాల్సి ఉంది. బ్రిడ్జికి సమీపంలోని బస్టాప్‌ను మరో చోటికి మార్చాలి. మూసివేసిన యూటర్న్ తెరవాలి.రైల్ నిలయం, తుకారాం గేట్ సమీపంలో ఆర్‌యూబీలను విస్తరించిన తరహాలో రాణిగంజ్ రైల్వే టన్నెల్ మార్గాన్ని చేయాలనే డిమాండ్లు ఉన్నాయి.

చిలకలగూడ, మాణికేశ్వర్‌నగర్, విద్యానగర్, తిలక్‌నగర్, నింబోలి అడ్డా, కాచిగూడ, యాకుత్‌పురా, భవానీనగర్, లలితాబాగ్, జీఎం చావునీ, శివరాంపల్లి ప్రాంతాల్లో ఆర్‌యూబీలను విస్తరించాలి.

నాంపల్లి రైల్వేస్టేషన్, డీజీపీ కార్యాలయం, లక్డీకాపూల్, ఎంఎస్ మక్తా, కుందన్‌బాగ్, నేచర్‌క్యూర్ హాస్పిటల్, పాటిగడ్డ, చందానగర్, హఫీజ్‌పేట్, గాయత్రినగర్, యూసుఫ్‌గూడ, సనత్‌నగర్, బాబానగర్, ఉప్పర్‌గూడ లెవెల్ క్రాసింగ్, మల్లాపూర్ సమీపంలోని ఎన్ఎఫ్‌సీ, చర్లపల్లి సమీపంలోని భరత్‌నగర్, గౌతంనగర్, సఫిల్‌గూడ లెవెల్ క్రాసింగ్, బొల్లారం, తుర్కపల్లి, బీహెచ్ఇఎల్ కాలనీ, కిష్టమ్మ ఎన్‌క్లేవ్, వెస్ట్ వెంకటాపురం, వాజ్‌పేయీనగర్ లెవెల్ క్రాసింగ్, కాకతీనగర్ లెవెల్ క్రాసింగ్, వినాయక్‌నగర్ లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యూబీ, ఆర్‌వోబీల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

# వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరేనా..!

గోదావరిఖని: సింగరేణిలో వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరేందుకు ఇంకా నాలుగు నెలల సమయం ఉంది. ఈ నేపథ్యంలో ఉత్పత్తి వేగవంతం చేసేందుకు మరింత కసరత్తు చేయాల్సి ఉంది. గనుల్లో పని స్థలాలు గుర్తించాలి. బొగ్గు పొరలను వెలికి తీసేందుకు నిరంతర పర్యవేక్షణ వేగం చేయాలి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా సింగరేణి నిర్దేశించుకుంది. ప్రస్తుతం ఎనిమిది నెలలు గడచిపోయాయి. మిగిలిన నాలుగు నెలల్లో సాధించాల్సిన ఉత్పత్తిపై దృష్టి సారించాల్సి ఉంది. కార్మికులకు నాలుగు నెలల పాటు నగదు ప్రోత్సాహక పథకాన్ని అమలు చేయాలి. ఈ విషయమై ఇప్పటి వరకు యాజమాన్యం ఎలాంటి ప్రకటన చేయలేదు. నవంబరు నాటికి సింగరేణి 40 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధించింది. మిగిలిన కాలంలో 32 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తేనే వార్షిక లక్ష్యం చేరుకునే అవకాశం ఉంది. నవంబరు నెలలో 99 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించగా గడచిన ఏడు నెలల్లో తక్కువ శాతం ఉత్పత్తి సాధించడంతో వార్షిక లక్ష్యానికి దూరంగా ఉంది.

**నెలకు 8 మిలియన్ టన్నులు...**రానున్న రోజుల్లో నెలకు 8 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తేనే వార్షిక లక్ష్యానికి చేరుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు నెలకు 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తూ వస్తున్న సింగరేణి రానున్న కాలంలో 8 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు కేవలం అయిదు ఏరియాల్లో మాత్రమే వందశాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. గత అక్టోబరులో 72 శాతం, అక్టోబరులో 91 శాతం, నవంబరులో 99 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఇందులో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు ప్రాంతాలు మాత్రమే వంద శాతానికి మించి ఉత్పత్తి చేశాయి.

**అందుబాటులోకి రాని కొత్త గనులు**

సింగరేణి వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి కొత్త గనులు అందుబాటులోకి రాలేదు. ఈ ఏడాది ప్రణాళికలో ఉన్న నైనీ బొగ్గుబ్లాకుతో పాటు కొత్తగూడెం వీకే ఓసీపీ, ఇల్లెందు ప్రాంతంలోని రొంపేడు ఓసీపీ, రామగుండం మెగా ఓసీపీలు అందుబాటులోకి రాలేదు. ఈ కారణంగా వార్షిక బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం కనిపించే అవకాశం ఉంది.

**ప్రోత్సాహక పథకంపై ఆశలు**సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం కార్మికులకు ఆర్థిక సంవత్సరంలో చివరి నాలుగు మాసాలు ప్రోత్సాహక పథకాలను ప్రవేశపెడుతుంది. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో హాజరుతో పాటు ఉత్పత్తి ఆధారంగా కార్మికులకు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తుంది. నాలుగు నెలల్లో గైర్హాజరు లేకుండా పనిచేసిన కార్మికులకు ప్రత్యేక ప్రోత్సాహకం, వ్యక్తిగతంగా, సామూహికంగా బొగ్గు ఉత్పత్తి సాధనలో అందించిన సహకారం. వంద శాతం ఉత్పత్తి సాధించేందుకు ఉద్యోగుల పని విధానం లాంటి అంశాలను పరిగణలోకి తీసుకుని వారికి ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవల గుర్తింపు సంఘంతో నిర్వహించిన నిర్మాణాత్మక సమావేశంలో ఈ విషయాన్ని నాయకులు ప్రస్తావించారు. డివిజన్ల వారిగా ప్రోత్సాహక పథకాన్ని పరిగణలోకి తీసుకుని లక్ష్యాన్ని అధిగమించిన ఉద్యోగులకు వారి పని విధానం ఆధారంగా ప్రోత్సాహకాన్ని పంపిణీ చేస్తారు.




# స్టెల్లా షిప్‌లో మరోసారి తనిఖీలు

కాకినాడ: రేషన్ బియ్యం నిల్వచేసిన స్టెల్లా ఎల్ పనామా నౌకలో మరోసారి తనిఖీలు చేపట్టారు. ఇందు కోసం పోర్టు, కస్టమ్స్, పౌరసరఫరాలు, పోలీసు, రెవెన్యూ అధికారులతో బృందం సముద్రంలోకి వెళ్లారు. ఈ మల్టీ డిసిప్లీనరీ కమిటీ బృందం రేషన్ బియ్యం నమూనాలు సేకరించి నిజానిజాలు నిగ్గు తేల్చనుంది. నౌకలో 640 టన్నుల పేదల బియ్యం ఉన్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ గత నెల 27న ప్రకటించారు. 29న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ పోర్టులు సందర్శించి.. ఇక్కడి భద్రత వైఫల్యాలు, కీలక శాఖల పర్యవేక్షణ లోపాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అక్కడికక్కడే 'సీజ్ ద షిప్' అని ఆదేశించారు. దీంతో అందరి దృష్టి కాకినాడ పోర్టుల వైపు మళ్లింది. కాకినాడ కేంద్రంగా గత అయిదేళ్లు రెచ్చిపోయిన రేషన్ మాఫియా రెక్కలు విరిచేయాలన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. వివాదాస్పద నౌక నుంచే ప్రక్షాళనకు నిర్ణయించింది. ఈనేపథ్యంలో ఏర్పాటు చేసిన బృందం బుధవారం నౌకను పరిశీలించింది.

# వ్యాపారాల్లో వాటాలు లాక్కోవడం ఇప్పుడే చూస్తున్నాం: సీఎం చంద్రబాబు



అమరావతి: అధికారం అండతో గన్నుపెట్టి ఆస్తులు రాయించుకోవడం ఎక్కడా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వ్యాపారాల్లో వాటాలు తీసుకున్న ఘటనలు దేశ చరిత్రలోనే లేవన్నారు. కొత్త తరహా నేరాల పట్ల చర్యలేంటో ప్రభుత్వం తీవ్రంగా ఆలోచిస్తోందని పేర్కొన్నారు. అవినీతి గురించి విన్నాం కానీ.. వ్యాపారాల్లో వాటాలు లాక్కోవడం ఇప్పుడే చూస్తున్నామన్నారు. తుపాకీ చూపించి మరీ ఆస్తుల్లో వాటాలు లాక్కోవడం మునుపెన్నడూ లేదన్నారు. ముంబయిలో మాఫియా బృందాలు లాక్కునే ఆస్తులను సీజ్ చేసే చట్టం ఉందని.. ఆ అంశంపై సమాచారం తెప్పించుకుంటామని చెప్పారు. ఆస్తులను పోగొట్టుకున్న వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.



# తెలుగు రాష్ట్రాల్లో పెద్ద భూకంపాలు వచ్చే అవకాశం లేదు

తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పెద్ద భూకంపాలు వచ్చే అవకాశం లేదని ఎన్‌జీఆర్ఐ రిటైర్డ్ శాస్త్రవేత్త పూర్ణచందర్ రావు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఉదయం అలజడి సృష్టించిన భూ ప్రకంపనలపై ఆయన పలు వివరాలు వెల్లడించారు. ప్రధాన కంపనం పూర్తయిందని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో సర్దుబాటు కారణంగా భూప్రకంపనలు వస్తాయన్నారు. ఆ తరంగాలు ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తాయని చెప్పారు. 1969లో భద్రాచలంలో 5.7 తీవ్రతతో భూకంపం సంభవించిందని తెలిపారు. ఆ తర్వాత మళ్లీ 5.0 తీవ్రతతో ఇప్పుడు భూప్రకంపనలు వచ్చాయన్నారు. దీని వల్ల భారీ నష్టం ఉండదన్నారు. సర్దుబాటు కారణంగా చిన్న చిన్న కంపనాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

# ఏపీ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్



అమరావతి: ఏపీ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్ నియమితులయ్యారు. ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ ర్యాంక్ ఇచ్చింది.

ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీఎం చంద్రబాబు కార్యక్రమాల నిర్వహణ వ్యవహారాలను పెందుర్తి వెంకటేశ్ పర్యవేక్షించనున్నారు. ఆయన గతంలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009, 2014 ఎన్నికల్లో విజయం సాధించారు

# ఉచిత విద్యుత్‌పై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: మంత్రి గొట్టిపాటి



అమరావతి: ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి తెదేపా కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. 200 యూనిట్ల వరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతిఒక్కరూ దీన్ని వినియోగించుకోవాలని కోరారు. 15,17,298 ఎస్సీ కుటుంబాలకు, 4,75,557 ఎస్టీ కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిస్తోందని తెలిపారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది తెదేపానే అని గుర్తుచేశారు. దీనిపై అసత్య ప్రచారాలు నమ్మొద్దని కోరారు. కూటమి ప్రభుత్వంపై బురద చల్లేలా కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు.

# ఇంటి మిద్దె కూలి ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి



కుందుర్పి: అనంతపురం జిల్లా కుందుర్పిలో విషాదం చోటు చేసుకుంది. ఇంటి మిద్దె కూలి ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందారు.

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వీరు ఉంటున్న ఇల్లు దెబ్బతింది. దీనికితోడు మిద్దెపై వర్షపు నీరు నిలిచింది. ఈ క్రమంలోనే బుధవారం తెల్లవారుజామున మిద్దె కూలిపోయింది. మృతులను గంగన్న, శ్రీదేవి, సంధ్యగా గుర్తించారు.

# జగన్.. వైకాపా నాయకులే భూ సమస్యలు పెంచారు: మంత్రి అనగాని


గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయంలో జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. అన్ని రకాల భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించారు. భూ వివాదాలకు ముగింపు పలికే విధంగా సదస్సులు నిర్వహించాలని తెలిపారు. ఈ సదస్సుల్లో భూ దురాక్రమణలు, 22ఏ భూముల ఉల్లంఘనపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసి, పేదలకు సమస్యలు లేని పాలన అందించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని మంత్రి వెల్లడించారు. క్షేత్రస్థాయిలో వైకాపా అధినేత జగన్, ఆ పార్టీ నాయకులే భూ సమస్యలు పెంచారని మంత్రి అనగాని ఆరోపించారు.

ల్యాండ్, ఇసుక, లిక్కర్ మాఫియాల ద్వారా గత ప్రభుత్వం నిధులు దోచుకుందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు ప్రతినెలా రివ్యూ పెట్టి సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజయవాడ వరదల కారణంగా సదస్సులు వాయిదా పడ్డాయన్నారు. ఈనెల 6 నుంచి వచ్చేనెల 8 వరకు 17,564 గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. నూతన రేషన్ కార్డులపైనా సదస్సుల్లో చర్చిస్తామన్నారు. గ్రామాల్లో లీజ్‌కు ఇచ్చిన భూముల స్టేటస్ ఎలావుందో చూస్తామని తెలిపారు. మదనపల్లి వ్యవహారంపై సీఐడీ విచారణకు సీఎం ఇప్పటికే ఆదేశించారని మంత్రి వెల్లడించారు.



# స్వర్ణ దేవాలయంలో కాల్పులు

అమృత్‌సర్: పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో కాల్పులు కలకలం రేపాయి. ప్రఖ్యాత స్వర్ణ దేవాలయంలో పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ పార్టీ నేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై గుర్తుతెలియని వ్యక్తి కాల్పులకు పాల్పడ్డాడు. ఆయన సేవాదార్‌గా శిక్ష అనుభవిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. శిక్షలో భాగంగా స్వర్ణ దేవాలయ ప్రవేశద్వారం వద్ద సుఖ్‌బీర్ చక్రాల కుర్చీపై కూర్చొని సేవాదార్ (కాపలాదారుడు)గా ఉండగా.. ఓ వృద్ధుడు ఆయనను సమీపించాడు. కొన్ని అడుగుల దూరంలోనే ఉన్న అతడు ప్యాంట్ జేబులోంచి తుపాకీ తీసి సుఖ్‌బీర్‌పై కాల్పులు జరిపాడు. గమనించిన సుఖ్‌బీర్ వ్యక్తిగత సిబ్బంది వెంటనే వృద్ధుడిని అడ్డుకొని పక్కకు తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది. భద్రతా సిబ్బంది అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో సుఖ్‌బీర్‌కు ఎలాంటి హానీ జరగలేదు. నిందితుడిని నరైన్ సింగ్ చౌరాగా గుర్తించారు. అతడు గతంలో బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ అనే ఉగ్రముఠాలో పనిచేసినట్లు పలు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. 1984లో నరైన్ సింగ్ సరిహద్దులు దాటి పాకిస్థాన్ వెళ్లినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. పంజాబ్‌లోకి అక్రమ ఆయుధాలు తేవడం, పేలుడు పదార్థాల రవాణాలో ఇతడు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. ఆ తర్వాత కొంతకాలానికి భారత్ తిరిగొచ్చిన అతడిని పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. కొన్నాళ్ల పాటు జైలుశిక్ష కూడా అనుభవించినట్లు తెలుస్తోంది. శిరోమణి అకాలీదళ్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సుఖ్‌బీర్ సింగ్ బాదల్ మతపరమైన తప్పిదాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. 2007-17 మధ్య కాలంలో పార్టీతోపాటు వారి ప్రభుత్వం రాజకీయంగా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నట్లు అకాల్ తఖ్త్ నిర్ధరించింది. ఈ విషయంలో పార్టీ చీఫ్ సుఖ్‌బీర్‌ను దోషిగా తేల్చింది. సేవకుడిగా అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంలో పాత్రలు, బూట్లు శుభ్రం చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా శిరోమణి అకాలీదళ్ పార్టీ చీఫ్‌గా ఉన్న ఆయన రాజీనామాను ఆమోదించి.. ఆరు నెలల్లోగా పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని సూచించింది. దీంతో ఆయన మంగళవారం నుంచి ఈ శిక్షను అనుభవిస్తున్నారు. చేసిన తప్పులను అంగీకరిస్తున్నట్లు రాసి ఉన్న ఓ చిన్న బోర్డును మెడలో వేసుకొని, చేతిలో ఈటెను ధరించి సేవాదార్‌గా పనిచేస్తున్నారు.



# తెలుగు రాష్ట్రాల్లో భూ ప్రకంపనలు

## తెలుగు రాష్ట్రాల్లో స్వల్ప భూ ప్రకంపనలు.. ఇళ్ల నుంచి బయటకు ప్రజల పరుగులు

తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల స్వల్ప భూ ప్రకంపనలు వచ్చాయి. బుధవారం ఉదయం 7.27 గంటలకు కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి బయటకు పరుగులు తీశారు. తెలంగాణలోని ములుగు జిల్లా మేడారంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.0గా నమోదైంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలు వెల్లడించారు. భూకంప కేంద్రం నుంచి 225 కి.మీ పరిధిలో ప్రకంపనల ప్రభావం కనిపించింది. ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, జగ్గయ్యపేట, నందిగామ, ఏలూరు సహా పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. తెలంగాణలో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, జనగామ జిల్లాల పరిధిలో ప్రకంపనలు వచ్చాయి. హైదరాబాద్ నగర పరిధిలోని వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పరిసర ప్రాంతాల్లో భూమి కంపించింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు, హనుమకొండ, భూపాలపల్లితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, చర్ల, చింతకాని, నాగులవంచ, ఇల్లెందు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి. ఏటూరు నాగారం మండలం శంకరాజుపల్లెలో ఓ ఇంటి గోడ కూలింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 3 సెకన్ల పాటు ప్రకంపనలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు.

# ఏపీలో 829 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



కడప: వైఎస్సార్ జిల్లాలో 829 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు అందజేశారు. ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వీటిని జారీ చేశారు. పాఠశాలల్లో పిల్లల అపార్ నమోదును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయలేదని కడప జిల్లా విద్యాధికారి నోటీసులు అందజేశారు. మూడు రోజుల్లో సమాధానం చెప్పాలని అందులో పేర్కొన్నారు.

లేకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు సాంకేతిక సమస్యకు తాము ఎలా బాధ్యులవుతామని ఉపాధ్యాయులు అంటున్నారు.

# మంత్రి లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఆర్టీసీ డ్రైవర్ లోవరాజు



అమరావతి: విధి నిర్వహణలో సినిమా పాటకు స్టెప్పులు వేసి సస్పెన్షన్‌కు గురైన తుని ఆర్టీసీ డిపో డ్రైవర్ లోవరాజు.. మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. తన సస్పెన్షన్ రద్దు చేయించి, తిరిగి విధుల్లోకి తీసుకునేలా చొరవ చూపించిన మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ జిల్లా తుని ఆర్టీసీ డిపోలో లోవరాజు అవుట్ సోర్సింగ్ విధానంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అక్టోబర్ 24న బస్సు రౌతులపూడి నుంచి తుని డిపోకు వెళ్తుండగా మార్గమధ్యలో కర్రల లోడ్‌తో ట్రాక్టర్ అడ్డొచ్చింది. చిన్న రోడ్డు కావడం, బస్సు ముందుకు వెళ్లలేని పరిస్థితుల్లో బస్సును నిలిపివేశారు.

ఈ లోగా ప్రయాణికులకు వినోదం పంచడానికి లోవరాజు సరదాగా సినిమా పాటకు డ్యాన్స్ వేశారు. దీన్ని ఓ యువకుడు వీడియో తీయడంతో వైరల్ అయ్యింది. సోషల్ మీడియాలో డ్రైవర్ చేసిన డ్యాన్స్ చూసి మంత్రి లోకేశ్ మెచ్చుకున్నారు.

ఈలోగానే నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో అధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. ఇది మంత్రి లోకేశ్ దృష్టికి రావడంతో సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేయిస్తానని హామీ ఇచ్చారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత వ్యక్తిగతంగా కలుస్తానని లోవరాజుకు మాట ఇచ్చారు. ఈ రోజు తన కుటుంబసభ్యులతో వెళ్లి మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా లోవరాజు యోగక్షేమాలను అడిగిన మంత్రి.. అన్ని విధాల అండగా ఉంటానన్నారు.

# జోక్యం చేసుకోండి.. కేంద్రానికి షర్మిల సంచలన లేఖ..

విజయవాడ: సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌కు ఏపీసీసీ చీఫ్ వైయస్ షర్మిల సంచలన లేఖ రాశారు. ఏపీలో అదానీ గ్రూప్ కంపెనీ విద్యుత్ కొనుగోలు ఒప్పందం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నందున ఒప్పందాన్ని రద్దు చేయాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 2021లో అదానీ, ఏపీ రాష్ట్ర డిస్కమ్‌ల మధ్య విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు జరిగాయని.. ఈ ఒప్పందాల వ్యవహారంలో అదానీ ద్వారా అప్పటి సీఎం జగన్‌కు రూ. 1750 కోట్లు ముడుపులు అందాయని అమెరికా దర్యాప్తు సంస్థ నిర్ధారించిందని పేర్కొన్నారు.

**వేల కోట్ల భారం..** ఈ ఒప్పందాల వల్ల గత ప్రభుత్వం ఏపీ ప్రజలపై వేల కోట్ల భారం మోపిందని లేఖలో తెలిపారు. యూనిట్‌కు రూ. 2.49 చొప్పున 7000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను సరఫరా చేయాలని సంతకం చేశారని.. సెప్టెంబర్ 2024 నుండి 25 సంవత్సరాల కాలానికి భారాలు వసూళ్లు చేసేలా ఒప్పందం సంతకం చేశారని వెల్లడించారు.

**జోక్యం చేసుకోవాలి:** అధునాతన సాంకేతికతల రాకతో, రోజురోజుకు అధిక-నాణ్యత గల విద్యుత్‌ను పొందడం సులభం అవుతుందన్నారు. ఇది ఆటోమేటిక్‌గా చౌకగా మారుతుందనేది వాస్తవమని.. 25 సంవత్సరాల కాలానికి ఒప్పందాలు కుదుర్చుకోవడం సహేతుకం కాదని తన అభిప్రాయాన్ని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కోలుకోలేని నష్టం అయితే, ఆ భారం చివరికి ఏ తప్పు చేయని ప్రజలపై పడుతుందని లేఖలో వివరించారు. శాశ్వత ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రానికి భారీ ఉపశమనం కలిగించే మీరు జోక్యం చేసుకోవాలని లేఖలో కోరారు.

## మినీ స్కర్ట్‌లో అందాల టైగర్ మెరుపులు

సేవ్ ది టైగర్స్ వెబ్ సిరీస్‌లో కీలక పాత్రలో నటించిన ముద్దుగుమ్మ దేవియాని శర్మ. చేసిన సినిమాలు, పాత్రలు తక్కువే అయినా సోషల్ మీడియాలో ఈ అమ్మడి ఫాలోయింగ్ కాస్త ఎక్కువే. రెగ్యులర్‌గా ఈమె అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉన్న ఈ అమ్మడి ఫోటోలకు మంచి స్పందన దక్కుతూ ఉంటుంది. సోషల్ మీడియాలో ఈమె ఫోటోలను చూసి చాలా మంది ఫిల్మ్ మేకర్స్ ఈమెని సంప్రదిస్తూ ఉంటారు. అంతటి అందాల ఫోటోలను ఈమె షేర్ చేస్తూ ఉంటుంది అనడంలో సందేహం లేదు. సాధారణంగా టాప్ స్టార్ హీరోయిన్స్ ఫోటోలకు సోషల్ మీడియాలో ఎక్కువ రీచ్ ఉంటుంది. కానీ దేవియాని శర్మ షేర్ చేసే ఫోటోలకు నెటిజన్స్ నుంచి ఎక్కువ రెస్పాన్స్ దక్కుతూ ఉంటుంది. ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలకు, వీడియోలకు ఎక్కువగా లైక్స్ రావడంతో పాటు, కామెంట్స్ షేర్స్ దక్కుతూ ఉంటాయి. అందుకే ఈ అమ్మడు ముందు ముందు మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి అంటూ



కొందరు కామెంట్ చేస్తూ ఉంటారు. అందంగా కనిపించే దేవియాని మరోసారి తన అందాల ఫోటోలతో వార్తల్లో నిలిచింది. ఈసారి మినీ స్కర్ట్ ధరించి నడుము అందం చూపిస్తూ హొయలు పోయిన ఈ అమ్మడి లుక్‌కి నెటిజన్స్ ఫిదా అయ్యారు. థైస్‌ను చూపించడంతో పాటు, నడుము చూపించడంతో ముద్దుగుమ్మ నుంచి చూపు తిప్పలేక పోతున్నారు. ఈ స్థాయి అందం స్టార్ హీరోయిన్స్‌కి మాత్రమే సాధ్యం అంటూ కొందరు మాట్లాడుతూ ఉంటే మరికొందరు ఇండస్ట్రీలో ఉన్న ఎంతో మంది హీరోయిన్స్ అందంతో పోల్చితే దేవియాని అందం అదుర్స్ అన్నట్లుగా మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి సోషల్ మీడియాలో దేవియాని ఫోటోలు మళ్లీ వైరల్ అవుతున్నాయి. సైతాన్, రొమాంటిక్, అనగనగా ప్రాజెక్ట్‌ల్లో నటించినా పెద్దగా గుర్తింపు సొంతం చేసుకోలేక పోయిన ఈ అమ్మడు సేవ్ ది టైగర్స్ సిరీస్ తో మాత్రం మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. టైగర్ బ్యూటీ అంటూ సోషల్ మీడియాలో పాపులారిటీని సొంతం చేసుకుంది. ఆ సిరీస్ తెచ్చిన గుర్తింపు కారణంగా సోషల్ మీడియాలో ఫాలోవర్స్ సంఖ్య భారీగా పెరిగినట్లుగా తెలుస్తోంది. ముందు ముందు ఈ అమ్మడికి వరుసగా సినిమా ఆఫర్లు, మరిన్ని సిరీస్‌ల్లో నటించే అవకాశాలు వస్తాయని ఇలాంటి ఫోటోలు షేర్ చేసిన సమయంలో కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## వరుణ్ నెక్స్ట్.. ఎగ్జైటింగ్ ఎంటర్టైనర్ లోడింగ్!

టాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ తేజ్.. మెగా ఫ్యామిలీ నుంచి వచ్చినప్పటికీ తనకంటూ స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. వైవిధ్యమైన కాన్సెప్టులతో సినిమాలు చేస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కానీ కొన్నాళ్లుగా సరైన హిట్ కోసం వెయిట్ చేస్తున్నారు. రకరకాల జోనర్లలో చిత్రాలు చేస్తున్నా సక్సెస్ అందుకోలేకపోతున్నారు. గద్దలకొండ గణేష్ తర్వాత వరుసగా సినిమాలు చేసినా గట్టి కమ్ బ్యాక్ సొంతం చేసుకోలేకపోయారు. రీసెంట్ గా వచ్చిన మట్కా మూవీపై చాలా హోప్స్ పెట్టుకున్నారు. కరుణ కుమార్ దర్శకత్వం వహించిన ఆ సినిమాతో భారీ హిట్ కొడదామనుకున్నారు. కానీ బాక్సాఫీస్ వద్ద మట్కా దారుణంగా నిరాశపరిచింది. వరుణ్ కెరీర్ లో మరో ఫ్లాప్ చేరింది. దీంతో వరుణ్ కాస్త బ్రేక్ తీసుకుంటారని కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. కానీ అవేం నిజం కాదు! ఇప్పుడు ఆయన కొత్త మూవీ వర్క్ తో



బిజీగా ఉన్నారు. మేర్లపాక గాంధీ డైరెక్షన్ లో ఓ పెర్ఫెక్ట్ ఎంటర్టైనర్ చేయనున్నారు. ఇప్పటికే వరుణ్ కథ విని ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేస్తున్నారు మేకర్స్. టాలీవుడ్ ప్రముఖ యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్స్ సంయుక్తంగా వరుణ్- మేర్లపాక గాంధీ మూవీని భారీ స్థాయిలో నిర్మిస్తున్నాయి. ఇప్పటికే వరుణ్ ఫస్ట్ ఫ్రేమ్స్ సంస్థతో కంచె సినిమాకు గాను వర్క్ చేశారు. ఆ మూవీ మంచి ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు యూవీ బ్యానర్ తో తొలిసారి జత కడుతున్నారు. అదే సమయంలో మేర్లపాక గాంధీ యూవీ క్రియేషన్స్ నిర్మాణంలో ఎక్స్ ప్రెస్ రాజా మూవీ చేయగా.. బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. ఇప్పుడు మరోసారి ఆ సంస్థ నిర్మాణంలో వరుణ్ తో సినిమా చేస్తున్నారు. మంచి అట్రాక్టివ్ స్టోరీ లైన్ తో తెరకెక్కిస్తున్నారని ఇండస్ట్రీలో వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. విలక్షణమైన పాత్రలో వరుణ్ కనిపించనున్నారట. అయితే వరుణ్ తేజ్ తో పాటు మేర్లపాక గాంధీ కూడా మంచి హిట్ కోసం వెయిట్ చేస్తున్నారు. ఆయన చివరి రెండు సినిమాలు లైక్ షేర్ సబ్ స్క్రైబ్, కృష్ణార్జున యుద్ధం డిజాస్టర్లుగా నిలిచాయి. దీంతో ఇప్పుడు వరుణ్ కు మంచి హిట్ ఇచ్చి తాను కూడా కొట్టాలని చూస్తున్నారు. వచ్చే ఏడాది మార్చిలో రెగ్యులర్ షూటింగ్ ను స్టార్ట్ చేయనున్నారు. మరి ఆ ప్రాజెక్ట్ ఇద్దరికీ ఎలాంటి సక్సెస్ అందిస్తుందో వేచి చూడాలి.





## 'పుష్ప 2' టికెట్ రేట్లు.. నార్త్ లో ఏమనుకుంటున్నారంటే?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2: ది రూల్' మూవీ బాక్సాఫీస్ ను రూల్ చేయడానికి రెడీ అయిపోయింది. డిసెంబర్ 5వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ చేయడానికి మేకర్స్ సర్వం సిద్ధం చేసారు. మరికొన్ని గంటల్లో ప్రీమియర్ షోలతో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇక టికెట్ రేట్ల గురించి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. ఇష్టారాజ్యంగా టికెట్ ధరలు పెంచేసారంటూ ఓ వర్గం సినీ ప్రియులు కామెంట్లు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, మిగతా చోట్ల కూడా 'పుష్ప 2' సినిమాకి అధిక టికెట్ రేట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ముంబై, ఢిల్లీ వంటి మహా నగరాలలో ప్రీమియం థియేటర్లలో టిక్కెట్ ధరలు ?1,800 నుండి ?2,400 వరకు ఉండగా.. ఇతర మల్టీప్లెక్స్‌లలో 10-15% రేట్లు పెంచినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ముంబైలోని ఓ థియేటర్ లో లగ్జరీ క్లాస్ టికెట్ ధర ?3000 ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కర్ణాటకలోనూ టిక్కెట్ ధరలు చాలా ఎక్కువగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. 'పుష్ప: ది రైజ్' సినిమాకి సీక్వెల్ గా తెరకెక్కిన 'పుష్ప 2: ది రూల్'పై హైప్ ఏ రేంజ్ లో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. క్రేజ్ ను క్యాష్ చేసుకోడానికే టికెట్ రేట్లు భారీగా పెంచేసినట్లు అర్థమవుతోంది. అయితే ఏ సినిమాకైనా అధిక ధరల కారణంగా హ్యూజ్ ఓపెనింగ్స్ వచ్చినప్పటికీ.. సాధారణ ప్రేక్షకులు, కీలకమైన ఫ్యామిలీ ఆడియన్స్ దూరమయ్యే ప్రమాదం ఉందని విమర్శకులు వాదిస్తున్నారు. "పుష్ప-2 వంటి సినిమాలు సామాన్య మధ్యతరగతి ప్రేక్షకులను ప్రధానంగా ఆకర్షిస్తాయి. కానీ అధిక టికెట్ రేట్లు ఆ జనాభాను సినిమాకి దూరం చేసే ప్రమాదం ఉంది" అని ఢిల్లీలోని ఓ థియేటర్ ఓనర్ గుర్మీత్ సింగ్ అభిప్రాయ పడ్డారు. "ఢిల్లీలోని సింగిల్ స్క్రీన్‌లలో టికెట్ ధరలు ?235 నుండి ?250 వరకు ఉంటే మొత్తం షోలన్నీ ఫుల్ అవుతాయి. కానీ అదే పీవీఆర్ ప్లాజాలో టిక్కెట్ రేట్లు ?2500 కంటే ఎక్కువగా ఉండటం వల్ల కేవలం 10% టిక్కెట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. ఇలా పెంచిన ధరలు సినిమా బిజినెస్ కు హాని కలిగిస్తాయి" అంటూ సింగిల్ స్క్రీన్స్, ప్రీమియం మల్టీప్లెక్స్‌లలో టికెట్ అమ్మకాలలో వ్యత్యాసాన్ని ఉదాహరణగా చెప్పాడు. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'పుష్ప 2' టికెట్ రేట్లు టూ మచ్ గా ఉన్నాయని కొందరు సినీ ప్రియులు కామెంట్లు చేస్తున్నారు. నైజాంలో పెంచిన రేట్ల ప్రకారం 'పుష్ప 2' ప్రీమియర్ షోలకు మల్టీప్లెక్స్ లో ?1200, సింగిల్ స్క్రీన్ లో ?1100 టికెట్ ధరలు ఉన్నాయి. రిలీజ్ డే నుంచి మొదటి నాలుగు రోజులు గరిష్ఠంగా ?530 టికెట్ రేటు ఉంది. ఏపీలోనూ ఈ చిత్రానికి టికెట్ ధరలు పెంచుకోడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా హైక్స్ ఇచ్చారు. అయితే సోషల్ మీడియాలో టికెట్ రేట్ల మీద అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నప్పటికీ, అడ్వాన్స్ బుకింగ్స్ మాత్రం తగ్గడం లేదు. ఇప్పటికే ప్రీ సేల్స్ ద్వారా రూ.100 కోట్లకు పైగా వచ్చాయి. దీన్ని బట్టి అధిక టికెట్ ధరలు ఉన్నా, మూవీ లవర్స్ 'పుష్ప 2' చిత్రాన్ని రిలీజ్ రోజే చూడటానికి ఆసక్తి కనబరుస్తున్నారని స్పష్టమవుతోంది. ఇదిలా ఉంటే 'పుష్ప 2' టికెట్ రేట్లపై తెలంగాణ హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలైంది. దీనిపై మంగళవారం విచారించిన న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. "ప్రభుత్వమే టికెట్ రేట్లు పెంచడానికి పర్మిషన్ ఇచ్చింది కదా.. టికెట్ ధరలతో పోలిస్తే థియేటర్లలో పాప్‌కార్న్, కూల్ డ్రింక్స్, మంచి నీళ్ల బాటిళ్లను ఇంకా ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారు కదా" అని జడ్జి ప్రశ్నించారు. దీనిపై తదుపరి విచారణను డిసెంబరు 17వ తేదీకి వాయిదా వేశారు. అంటే సినిమా రిలీజైన పన్నెండు రోజులను ఈ పిటిషన్ విచారణకు రానుందన్నమాట.

## మృణాల్ ఠాకూర్ లోనూ మస్తు షేడ్స్ ఉన్నాయే!



సోషల్ మీడియాలో సెలబ్రిటీల యాక్టివిటీస్ గురించి చెప్పాల్సిన పనిలేదు. పేరుకు పేరు..డబ్బుకు డబ్బు తెచ్చిపెడుతోన్న మాధ్యమం ఇది. ఇక్కడ రాణించాలంటే? కేవలం సినిమా హీరోయిన్ మాత్రమే అవ్వాల్సిన పనిలేదు. లక్షల మంది ఫాలోవర్లు ఉంటే చాలు సెలబ్రిటీ హోదా దక్కినట్లే. ఇక నిజమైన సెలబ్రిటీల సంగతి వేరేలా ఉంటుందనుకోండి. తాజాగా మృణాల్ ఠాకూర్ అలియాస్ సీతమ్మ తనలో కొత్త యాంగిల్ ని ఒక్కొక్కటిగా బయటకు తీస్తుంది. ఇదిగో ఇక్కడిలా ముఖంపై రకరకాల ఎక్స్ ప్రెషన్ తో ఓ షో రిలీజ్ చేసింది. ఇందులో మృణాల్ ఒకరకంగా కాదు..రకరకాల ఎక్స్ ప్రెషన్ తో అదరగొట్టింది. చెవులకు హెడ్ ఫోన్స్ పెట్టుకుని అక్కడ సిచ్వేషన్ కి తగ్గట్టు అమ్మడు ముఖంలో హావభావాలు మారుస్తుంది. సంతోషం, దుఖం, విచారం. సందిగ్ధత ఇలా సన్నివేశానికి తగ్గట్టు ఎక్స్ ప్రెషన్స్ ఇచ్చింది. దానికి సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అభిమానులు తమదైన శైలిలో పోస్టులు పెడుతున్నారు. ఇక సీతమ్మ కెరీర్ ఇప్పుడు జెట్ స్పీడ్ తో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్, బాలీవుడ్ లో వరుసగా అవకాశాలు అందుకుంటుంది. ఇంకా చెప్పాలంటే టాలీవుడ్ ని మించి బాలీవుడ్ లో రెట్టించిన పారితోషికంతో అవకాశాలు ఒడిసి పట్టుకుంటుంది. ఇప్పటికే 'పూజా మేరీజాన్' షూటింగ్ పూర్తి చేసింది. అలాగే 'హైజవానీ హై తో ఇష్క్ హోనా హై' అనే మరో సినిమా షూటింగ్ లో పాల్గొంటుంది. ఈ సినిమాలతో పాటు కళాత్మక చిత్రాల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ నిర్మిస్తున్న చిత్రంలోనే మృణాల్ అవకాశం అందుకుంది. ఇందులో సిద్దాంత్ చతుర్వేది హీరోగా నటిస్తున్నారు. రవి ఉద్యవార్ తెరకెక్కిస్తున్నాడు. ఇదొక రొమాంటిక్ ఎంటర్ టైనర్. 'ఆషీకీ -2' తరహాలో ఉంటుందని ప్రచారం జరుగుతోంది. మ్యూజికల్ లవ్ స్టోరీగా హైలైట్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమాకి 'తుమ్ హీ హో 'అనే టైటిల్ ఖరారు చేసారు.

## పుష్ప 2' ర్యాంపేజ్.. 'బాహుబలి 2' రికార్డ్ బ్రేక్!


అస్సలు తగ్గేదేలే అంటూ పుష్పరాజ్ మరికొన్ని గంటల్లో థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతున్నాడు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటించిన 'పుష్ప 2: ది రూల్' సినిమా డిసెంబర్ 5న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతోంది. డిసెంబర్ 4 బుధవారం రాత్రి నుంచే ప్రీమియర్స్ ద్వారా ఈ మూవీ ఆడియన్స్ ముందుకు రాబోతోంది. అయితే విడుదలకు ముందు ఇప్పటికే ఎన్నో రికార్డులు సృష్టించిన 'పుష్ప 2' చిత్రం.. ఇప్పుడు మరో రికార్డ్ క్రియేట్ చేసింది. ఈసారి ఏకంగా 'బాహుబలి 2' పేరిట ఉన్న రికార్డునే బ్రేక్ చేసేసింది. 'పుష్ప 2: ది రూల్' సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేసిన కొన్ని గంటల్లోనే టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఈ క్రమంలో ఆన్ లైన్ టికెటింగ్ ప్లాట్ ఫామ్ బుక్ మై షోలో అత్యంత వేగంగా 10 లక్షల టికెట్లు అమ్ముడైన చిత్రంగా సరికొత్త రికార్డ్ సృష్టించింది. దీంతో 'బాహుబలి-2', 'కల్కి 2898 ఏడీ', కేజీఎఫ్-2' రికార్డులను 'పుష్ప



2' చెరిపేసినట్లయిందని సినీవర్గాలు పేర్కొన్నాయి. కేవలం బుక్ మై షోలోనే 1 మిలియన్ టికెట్స్ అమ్ముడవ్వగా.. పేటీఎం లాంటి ఇతర యాప్స్ లోనూ శరవేగంగా టికెట్స్ బుక్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇకపోతే బుక్ మై షోలో గంటకు అత్యధిక టిక్కెట్ల విక్రయాలు జరిగిన సినిమాగా 'పుష్ప 2: ది రూల్' రికార్డులకెక్కింది. ప్రతీ గంటకు 100%ఖ%ం టికెట్లు అమ్ముడవుతున్నట్లు తెలుస్తోంది. ఇంతకముందు 'కల్కి' (97.7%ఖ%), 'జవాన్' (86%ఖ%), 'లియో' (83%ఖ%), 'యానిమల్' (80%ఖ%) సినిమాలు ఈ జాబితాలో ఉండగా.. ఇప్పుడు 'పుష్ప' సీక్వెల్ వాటిని క్రాస్ చేసింది. అలానే ప్రపంచవ్యాప్తంగా అడ్వాన్స్ బుకింగ్స్‌లోనే రూ.100 కోట్లకుపైగా కలెక్షన్స్ రాబట్టిన ఇండియన్ సినిమాగా 'పుష్ప 2: ది రూల్' రికార్డ్ క్రియేట్ చేసిందని మేకర్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఓవర్సీస్‌లోనూ ఈ మూవీ ప్రీ సేల్ బుకింగ్స్‌లోనూ ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. రిలీజ్ కు ముందే ఇన్ని సంచలనాలు సృష్టిస్తున్న 'పుష్ప-2' సినిమా.. రిలీజ్ తర్వాత దగ్గర మరిన్ని రికార్డులు సొంతం చేసుకోవడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. వరల్డ్ బాక్సాఫీస్ వద్ద రూ. 1000 కోట్లతో లెక్క ప్రారంభం అవుతుందని కామెంట్స్ చేస్తున్నారు. ఎస్.ఎస్ రాజమౌళి రికార్డులకు దగ్గరగా వెళ్లడం కాదు, రాజమౌళి రికార్డులను సైతం బ్రేక్ చేస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరి 'పుష్ప 2: ది రూల్' సినిమా రూలింగ్ ఎలా ఉండబోతుందో చూడాలి. సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప 2' సినిమా తెరకెక్కింది. ఇందులో బన్నీ సరసన రష్మిక మందన్న హీరోయిన్ గా నటించింది. శ్రీలీల స్పెషల్ సాంగ్ చేసింది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాల్లో, 6 భాషల్లో, 12 వేలకుపైగా స్క్రీన్స్‌లో రిలీజ్ కాబోతున్న తొలి ఇండియన్ సినిమా ఇదే. 3డీ వెర్షన్ మినహా 2డీ, 4%ఀఠ%, ఐమాక్స్ వంటి ఆరు ఫార్మాట్లలో ఈ మూవీ విడుదల కాబోతోంది.

## పుష్ప.. ఈ సెంటిమెంట్ కూడా తోడైతే..

రష్మిక మందన్న.. తక్కువ టైమ్ లోనే ఎక్కువ పాపులరైన హీరోయిన్స్ లిస్ట్ లో ఈ ముద్దుగుమ్మ పేరు కచ్చితంగా ఉండి తీరుతుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన అనతి కాలంలోనే స్టార్ హీరోయిన్ గా మారిపోయిన ఆమె.. పుష్ప మూవీతో ఏకంగా నేషనల్ క్రష్ ట్యాగ్ ను దక్కించుకున్నారు. వేరే లెవల్ లో పాన్ ఇండియా రేంజ్ లో ఫ్యాన్స్ బేస్ దక్కించుకున్నారు. కన్నడ సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన రష్మిక.. డెబ్యూ మూవీ కిర్రిక్ పార్టీతో మంచి సక్సెస్ అందుకున్నారు. ఆ తర్వాత మరో రెండు కన్నడ చిత్రాల్లో నటించి.. తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. ఛలో సినిమాతో టాలీవుడ్ మూవీ లవర్స్ ను మెప్పించి సూపర్ హిట్ సొంతం చేసుకున్నారు. విజయ్ దేవరకొండతో గీతా గోవిందం చేసి బ్లాక్ బస్టర్ హిట్ ను దక్కించుకున్నారు. ఆ తర్వాత నుంచి వరుస అవకాశాలు అందుకుని దూసుకుపోతున్నారు. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ లో నటిస్తున్నారు. ప్రస్తుతం చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇప్పుడు పుష్ప-



2తో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. శ్రీవల్లి 2.0గా మరో మెప్పించేందుకు వెయిట్ చేస్తున్నారు. ఈసారి నేషనల్ అవార్డు కచ్చితంగా అందుకుంటానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే పుష్ప-2 డిసెంబర్ 5వ తేదీన విడుదల కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మూవీ.. బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందని అంతా అంచనా వేస్తున్నారు. బాక్సాఫీస్ వద్ద అనేక రికార్డులను తిరగరాస్తుందని పక్కాగా చెబుతున్నారు. అదే సమయంలో రష్మిక డిసెంబర్ సక్సెస్ సెంటిమెంట్ కూడా పుష్ప సీక్వెల్ కు తోడవ్వతుందని కామెంట్లు పెడుతున్నారు. రష్మికకు డిసెంబర్ తో మంచి అనుబంధం ఉంది. ఆమె డెబ్యూ మూవీ కిర్రిక్ పార్టీ డిసెంబర్ లోనే రిలీజ్ అయ్యి సూపర్ హిట్ అయింది. కన్నడలో ఆమె నెక్స్ట్ నటించిన అంజనీపుత్ర, చమక్ మూవీస్ కూడా అదే నెలలో రిలీజ్ అయ్యాయి. మంచి విజయాన్ని అందించాయి. డిసెంబర్ లో వచ్చిన పుష్ప-1తో రష్మిక ఎలాంటి హిట్, ఫేమ్ దక్కించుకున్నారో తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన యానిమల్ చిత్రంతో రష్మిక వేరే లెవెల్ హిట్ ను సొంతం చేసుకున్నారు. ఆ సినిమా కూడా డిసెంబర్ లో రిలీజ్ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు పుష్ప-2తో డిసెంబర్ 5వ తేదీన సందడి చేయనున్నారు. దీంతో తనకు లక్కీ మంత్ అయిన డిసెంబర్ లో పుష్ప2తో ఎలాంటి సక్సెస్ అందుకుంటారో చూడాలి.




## మాజీ సీఎం కొణిజేటి రోశయ్య నిబద్ధత, సమర్థత వల్లే తెలంగాణ మిగులు బడ్జెట్

హైదరాబాద్: దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య నిబద్ధత, సమర్థత వల్లే తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఆవిష్కృతమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్రం ఏర్పాటైందని గుర్తుచేశారు. రోశయ్య మూడో వర్ధంతి సందర్భంగా నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడారు. "నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రోశయ్య నన్ను తన ఛాంబర్‌కు పిలిపించుకుని విలువైన సూచనలు చేశారు. బాగా మాట్లాడుతున్నావు.. మరింత అధ్యయనం చేసి సభకు రావాలని చెప్పారు. ప్రతిపక్షం తప్పక ప్రశ్నించాలి.. పాలకపక్షం ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలకు మేలు కలిగేలా అధికార పక్షాన్ని నిలదీయాలని చెప్పారు. రోశయ్య తమిళనాడు గవర్నర్‌గా ఎలాంటి వివాదాలు లేకుండా పనిచేశారు. ఆయన పట్టుదల, మాటల్లో చతురత ఎంతో ముఖ్యమైనవి. పాలకపక్షంలో ఉంటే ప్రతిపక్షాలను.. ప్రతిపక్షంలో ఉంటే సీఎంగా ఉన్న వ్యక్తిని ఇరుకున పెట్టే విధానాన్ని ఆయన నుంచి మనం నేర్చుకోవాల్సిన అవసరముంది.

**అలాంటి నేత లేకపోవడం లోటే..** కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది సీఎంలుగా పనిచేశారు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, భవనం వెంకట్రామ్, అంజయ్య, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. ఇలాంటి వారంతా ప్రశాంతంగా ప్రభుత్వాన్ని నడిపించేందుకు కారణం రోశయ్య. సమస్యలను పరిష్కరించేందుకు వారికి కుడి భుజంలా ఆయన వ్యవహరించేవారు. అందుకే అప్పట్లో ఎవరు ముఖ్యమంత్రులుగా ఉన్నా నంబర్ 2 పొజిషన్ పర్మినెంట్. నంబర్ 1 పొజిషన్ మాత్రమే మారుతుండేది. ఎవరు సీఎం అయినా.. నంబర్ 2లో రోశయ్యే ఉండాలని కోరుకునేవారు. తెలంగాణ శాసనసభలో ఆయనలా వ్యూహాత్మకంగా సమస్యలను పరిష్కరించే నేత లేకపోవడం లోటుగా కనిపిస్తోంది.

**ఆర్యవైశ్యులకు సముచిత ప్రాధాన్యం..** ఏనాడూ సీఎం కావాలని రోశయ్య తాపత్రయ పడలేదు. సందర్భం వచ్చినప్పుడు ఆయన్ను సోనియాగాంధీ ముఖ్యమంత్రిని చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో ఎంపిక చేశారంటే పార్టీకి రోశయ్య పట్ల ఉన్న నమ్మకం, విశ్వాసం ఎలాంటిదో చెప్పొచ్చు. ఏనాడూ పదవులు కావాలని అధిష్ఠానాన్ని ఆయన కోరలేదు. హోదాలన్నీ వాటంతట అవే వచ్చాయి. రోశయ్యను అందరం స్ఫూర్తిగా తీసుకోవాలి. రాష్ట్రం ఆర్థికంగా రాణించాలంటే ఆర్యవైశ్యుల సహకారం అవసరం. వారి వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుమతులు ఇచ్చే బాధ్యత తీసుకుంటా. పార్టీలోనూ సముచిత ప్రాధాన్యం కల్పిస్తాం.

**హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం..** రెండు తెలుగు రాష్ట్రాలు నాకు సమానమేనని రోశయ్య చెప్పారు. 50 ఏళ్ల క్రితమే హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఇల్లు కట్టుకున్నట్లు తెలిపారు. నిఖార్సయిన హైదరాబాదీ రోశయ్య అని సంపూర్ణంగా విశ్వసిస్తున్నాను. ఆయనకు నగరంలో విగ్రహం లేకపోవడం లోటు. ఆర్యవైశ్య నేతలు మంచి ప్రాంతాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి సూచన చేస్తే.. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణం చేపడతాం. నాలుగో వర్ధంతి నాటికి దాన్ని పూర్తిచేస్తాం" అని రేవంత్ తెలిపారు.

## పెద్దపల్లిపై సీఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లు



హైదరాబాద్: పెద్దపల్లి జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి రాల జల్లు కురిపించారు. పెద్దపల్లికి రూరల్ పోలీసు స్టేషన్, మహిళా పోలీసు స్టేషన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను మంజూరు చేశారు. ఎలిగేడు మండల కేంద్రానికి పోలీసు స్టేషన్, వ్యవసాయ మార్కెట్‌ను మంజూరు చేశారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిని 100 పడకలకు పెంచేందుకు అనుమతి ఇచ్చారు. మంథనిలో 50 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేశారు. గుంజపడుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. పెద్దపల్లికి 4 వరుసల బైపాస్ రోడ్ మంజూరు చేశారు.

**తెలంగాణలో కొత్తగా రెండు ఆర్టీసీ డిపోలు :** తెలంగాణలో కొత్తగా రెండు ఆర్టీసీ డిపోలు మంజూరయ్యాయి. పెద్దపల్లి, ములుగు జిల్లా ఏటూరునాగారంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. కొత్త డిపోల మంజూరు సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. 10-15 సంవత్సరాల తర్వాత రెండు నూతన ఆర్టీసీ డిపోలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలో తీసుకుపోతున్నట్లు చెప్పారు.

కొత్త డిపోల ద్వారా ఆ ప్రాంత వాసులకు, మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రయాణికులకు మేలు జరుగుతుందని చెప్పారు.

## కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపం మార్చొద్దు: కేటీఆర్



హైదరాబాద్: మూర్తీభవించిన స్త్రీగా తెలంగాణ తల్లిని కేసీఆర్ రూపొందించారని, ఆయన మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మారిస్తే చరిత్ర క్షమించదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. నాడు ఇందిరాగాంధీ ప్రతిష్ఠించిన భరతమాత రూపాన్ని వాజ్‌పేయీ అధికారంలోకి రాగానే మార్చలేదు. దేశంలో ఎన్నోచోట్ల అధికార మార్పిడి జరిగింది. తెలుగుతల్లి విగ్రహ రూపం మారలేదు. కన్నడమాత విగ్రహం రూపు మారలేదు. కానీ, ఈ ముఖ్యమంత్రి.. కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. నాలుగేళ్ల తర్వాత రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టిన స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తాం. అధికారం ఉందని సాయుధ బలగాల నడుమ మీ నాటకాలు కొంతకాలం సాగుతాయి. కానీ, ఎల్లకాలం ఇదే పరిస్థితి ఉండదు" అని కేటీఆర్ హెచ్చరించారు.

## ఇవి విజయోత్సవాలు కావు.. వికృత ఉత్సవాలు: కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ దృష్టిలో.. పిల్లలకు పురుగుల అన్నం పెట్టడం విజయం.. వారి చావులు ఉత్సవం అని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. "యువతకు ఉద్యోగాలివ్వకపోవడం.. వారికి సంకెళ్లేయడం, రైతులను మోసం చేయడం.. వారికి ఉరి తాళ్లేయడం, ఆడబిడ్డలను ఆగం చేయడం.. వారి కన్నీళ్లు చూడటం, ఇళ్లు ఇస్తామని మోసం చేయడం.. ఉన్న ఇళ్లు కూల్చడం, రుణమాఫీ చేస్తామని మాట తప్పడం.. అప్పులకు నోటీసులివ్వడం, ఏడాది అరాచక పాలన.. ప్రజల చావులు, గోసలు కాంగ్రెస్ విజయమా? ఉత్సవమా? ఇవి విజయోత్సవాలు కావు.. వికృత ఉత్సవాలు" అని బండి సంజయ్ పేర్కొన్నారు.



## ఈ నంబర్ల నుంచి ఫోన్ వస్తే లిఫ్ట్ చేయొద్దు.. సైబర్ క్రైమ్ పోలీసుల హెచ్చరిక

నారాయణగూడ : అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌లపై అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా ౦94777 455913, ౦37127913091, ౦56322553736, ౦37052529259, ౦255901130460 ఇలాంటి నంబరుతో ఫోన్ వస్తే ఎత్తరాదన్నారు. ప్రధానంగా ౦371 (లాత్వియా), ౦375 (బెలారస్), ౦381 (సెర్బియా), ౦563 (లోవా), ౦370 (లిథువేనియా), ౦255 (టాంజానియా) వంటి కోడ్‌లతో మొదలయ్యే నంబరుతో రింగ్ చేసి ఎత్తిన తర్వాత హ్యాంగ్ చేస్తారన్నారు. తిరిగి ఫోన్ చేస్తే కాంటాక్ట్ జాబితాతోపాటు బ్యాంకు, క్రెడిట్ కార్డు ఇతర వివరాలు మూడు సెకన్లలో కాపీచేసుకునే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా 90 లేదా 09 నంబర్లను నొక్కాలని ఎవరైనా సూచిస్తే ఆ ప్రయత్నం చేయొద్దన్నారు. అలా చేస్తే మీ సిమ్ కార్డుని యాక్సెస్ చేయడానికి, మీ ఖర్చుతో కాల్ చేయడానికి, మిమ్మల్ని నేరస్థుడిగా చేయడానికి కుట్రపన్నుతున్నట్లుగా గుర్తించాలని తెలిపారు.






దిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని సంభల్‌లో ఇటీవల హింసాత్మక ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో బాధితులను పరామర్శించేందుకు బయల్దేరిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాను పోలీసులు అడ్డుకున్నారు. స్థానికేతరులు అక్కడికి రావడంపై ఆంక్షలున్న నేపథ్యంలో ఘాజీపూర్ సరిహద్దు వద్ద కాంగ్రెస్ ఎంపీల వాహనాలను యూపీ పోలీసులు అడ్డగించారు. రాహుల్, ప్రియాంక సంభల్ పర్యటనకు సిద్ధమైన నేపథ్యంలో ఈ బుధవారం ఉదయం నుంచే దిల్లీ సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఘాజీపూర్ సరిహద్దు వద్ద భారీగా పోలీసులు మోహరించారు. బారికేడ్లను ఏర్పాటుచేశారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నేతలు అక్కడికి చేరుకోగా పోలీసులు వారిని నిలువరించారు. దీంతో ప్రస్తుతం అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. మరోవైపు, ఈ పరిణామాలతో ఘాజీపూర్ సరిహద్దు వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ జిల్లాలో ఓ మసీదు ఉన్న స్థానంలో ఆలయం ఉందని కొందరు హిందూ పిటిషనర్లు గతంలో ట్రయల్ కోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ జరిపిన కోర్టు సర్వేకు ఆదేశాలు ఇచ్చింది.

ఆ సర్వే జరుగుతోన్న సమయంలోనే అల్లర్లు చెలరేగాయి. స్థానికులు, పోలీసులపై కొందరు రాళ్లతో దాడికి పాల్పడ్డారు. పోలీసులు, అధికారుల వాహనాలకు నిప్పంటించారు. ఆ ఘర్షణల్లో ఐదుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ప్రస్తుతం ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. మరోవైపు, ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా సంభల్‌కు స్థానికేతరులెవరూ రావొద్దని జిల్లా కలెక్టర్ ఆంక్షలు విధించారు. ఇటీవల సమాజ్‌వాదీ పార్టీ, స్థానిక కాంగ్రెస్ నేతలు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని వెనక్కి పంపించేశారు.




## అధ్యక్షుడి నెత్తిపై 'ఎమర్జెన్సీ' గండం.. దక్షిణకొరియాలో ఏం జరుగుతోంది?

సియోల్: అధ్యక్షుడి సంచలన నిర్ణయం.. పాటించేదే లేదంటూ ధిక్కరించిన పార్లమెంట్.. చేసేదేం లేక చేతులెత్తేసి వెనక్కితగ్గిన దేశాధినేత.. ఇవి మంగళవారం రాత్రి దక్షిణకొరియాలో చోటుచేసుకున్న పరిస్థితులు..! కొన్ని గంటల్లోనే దేశ రాజకీయాలు తలకిందులయ్యాయి. వరుసగా నెలకొన్న ఈ అనూహ్య పరిణామాలు కొరియా వాసులను ఆందోళనకు గురిచేశాయి. అధ్యక్షుడికి పదవీగండాన్ని తీసుకొచ్చాయి. అకస్మాత్తుగా ఎమర్జెన్సీ విధించి.. తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ ప్రకటనను విరమించుకున్న దక్షిణకొరియా అధినేత యూన్ సుక్ యోల్ రాజీనామా చేయాలంటూ విపక్షాలు పట్టుబడుతున్నాయి. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ.. యూన్ సుక్ యోల్ మంగళవారం సాయంత్రం 'ఎమర్జెన్సీ మార్షల్ లా' విధించారు. 'ఉత్తరకొరియా అనుకూల శక్తులను' ఏరివేసేందుకు ఇదే సరైన నిర్ణయం అని పేర్కొన్నారు.

1980 తర్వాత దేశంలో మార్షల్ లా విధించడం మళ్లీ ఇప్పుడే. అధ్యక్షుడి ప్రకటన అందర్నీ ఆశ్చర్యానికి గురిచేయడమే గాక.. దీనిపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అధ్యక్షుడి ప్రకటనతో రంగంలోకి దిగిన సైన్యం పార్లమెంటు, ఇతర రాజకీయ సమావేశాలు నిర్వహించరాదని హుకుం జారీచేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ దేశ జాతీయ అసెంబ్లీ (పార్లమెంట్) వెలుపల వేలాది మంది నిరసనకు దిగారు. వారిని భద్రతా బలగాలు అడ్డుకోవడం ఘర్షణలకు దారితీసింది.

**పార్లమెంట్‌లో ఓటింగ్ పెట్టి..** అటు జాతీయ అసెంబ్లీలోనూ ఇదే పరిస్థితి కన్పించింది. అధ్యక్షుడి నిర్ణయాన్ని ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ తీవ్రంగా ఖండించింది. అటు సొంత పార్టీ నుంచి కూడా దీనిపై వ్యతిరేకత వచ్చింది. దీంతో మంగళవారం అర్ధరాత్రి సమయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. 'మార్షల్ లా' అమలును వ్యతిరేకిస్తూ తీర్మానం తీసుకురాగా.. పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించడం గమనార్హం. అనంతరం మార్షల్ లా అమలు చట్టవిరుద్ధం అంటూ స్పీకర్ ప్రకటించారు.

**వెనక్కి తగ్గిన యూన్..** స్పీకర్ నిర్ణయం నేపథ్యంలో అధ్యక్షుడు యూన్ తన నిర్ణయంపై వెనక్కి తగ్గాల్సి వచ్చింది. దక్షిణ కొరియా చట్టప్రకారం పార్లమెంటులో మెజారిటీ ఓటు ద్వారా ఎమర్జెన్సీని ఎత్తేయవచ్చు. దీంతో ఎమర్జెన్సీ విధిస్తూ తాను తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు యూన్ మరో ప్రకటన చేశారు. దీంతో బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) అత్యయిక పరిస్థితిని అధికారికంగా ఎత్తివేశారు.

**రాజీనామా చేస్తారా?...** ఈ పరిణామాలతో అధ్యక్షుడిపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. యూన్ తక్షణమే రాజీనామా చేయాలని లేదంటే అభిశంసన తీర్మానాన్ని ఎదుర్కోవాలని ప్రధాన ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేసింది. దీనిపై యూన్ ఇంకా స్పందించలేదు. అయితే ఆయన పదవి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు అధ్యక్షుడి సీనియర్ సలహాదారులు, కార్యదర్శులు చెబుతున్నారు. ఈక్రమంలోనే బుధవారం జరగాల్సిన తన అధికారిక షెడ్యూల్‌ను కూడా ఆయన రద్దు చేసుకున్నారు. దక్షిణకొరియా పార్లమెంట్‌లో 300 మంది సభ్యులున్నారు. ఒకవేళ అధ్యక్షుడు అభిశంసనను గట్టెక్కాలంటూ 2/3 వంతు మెజార్టీ అంటే 200 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ, ఇతర చిన్న విపక్ష పార్టీలంతా కలిపి 192 మంది ఉన్నారు. అధ్యక్షుడి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా నిన్న రాత్రి తీసుకొచ్చిన తీర్మానం 190-0తో నెగ్గింది. ఈ పరిణామాలన్నీ చూస్తే యూన్ పదవి నుంచి దిగిపోవడం ఖాయంగానే కన్పిస్తోంది.




దిల్లీ: తెల్లవారితే తమ తల్లిదండ్రుల వివాహ వార్షికోత్సవం ఉందని వారి కుమారుడు, కుమార్తె అన్ని ఏర్పాట్లు చేశారు. కాని తెల్లారేసరికి వారి ఆనందం ఆవిరైపోయింది. తాను బయటకు వెళ్లొచ్చేలోపు గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో తల్లిదండ్రులు, సోదరి ప్రాణాలు కోల్పోవడంతో ఆ యువకుడు కన్నీరుమున్నీరుగా విలపించాడు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్లీలోని నెబ్‌సరాయి ప్రాంతంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని దుండగులు కత్తితో దారుణంగా పొడిచి హత్య చేశారు. స్థానిక నెబ్‌సరాయి ప్రాంతంలో దంపతులు తమ కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇంట్లోకి చొరబడి దంపతులు రాజేష్(55), కోమల్(47), వారి కుమార్తె కవిత(23)లపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేసి హత్య చేశారు. ఆ సమయంలో వాకింగ్ వెళ్లిన కుమారుడు ఉదయం 7 గంటల సమయంలో ఇంటికి వచ్చేసరికి ముగ్గురు రక్తపు మడుగులో పడి ఉండడం చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రి రాజేష్ ఆర్మీలో పని చేసి రిటైర్ అయ్యాడని తెలిపాడు. డిసెంబర్ 4(నేడు) తమ తల్లిదండ్రుల వివాహ వార్షికోత్సవం ఉందని.. వారితో కలిసి సంతోషంగా జరుపుకుందామనుకునేలోపు ఈ దారుణం చోటుచేసుకుందని కుమారుడు కన్నీరుమున్నీరయ్యాడు. కాగా, దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని.. దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

## పట్నం నరేందర్‌రెడ్డి పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. కింది కోర్టు ఉత్తర్వులు కొట్టివేయాలన్న ఆయన పిటిషన్‌ను తిరస్కరించింది. లగచర్ల ఘటనలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ నరేందర్‌రెడ్డి ఇటీవల క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని హైకోర్టు తిరస్కరించడంతో పాటు.. మెరిట్స్ ఆధారంగా బెయిల్ పిటిషన్‌ను పరిశీలించాలని కింది కోర్టును ఆదేశించింది.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com